J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 12 23.08.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

● ఈవీఎంల వివాదం

## ప్రజాస్వామ్యానికి ప్రమాదం!

- ఈవీఎంలలో గోల్‌మాల్ జరిగిందంటున్న రాజకీయ శ్రేణులు
- పోలైన ఓట్లకన్నా ఎక్కువ లెక్కించారంటున్న ఓట్ ఫర్ డెమోక్రసీ సంస్థ
- అలా జరిగితే ప్రజాస్వామ్యమే ప్రశ్నార్థకమవుతుందంటున్న మేధావులు
- కేంద్రప్రభుత్వం స్పష్టత ఇవ్వాలంటున్న విశ్లేషకులు



దేశ రాజకీయాలలో ఎప్పుడూ లేని తరహాలో ఒక కొత్త వివాదం ఇప్పుడు తెరపైకి వచ్చింది. తాజాగా జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఈవీఎంలలో గోల్‌మాల్ జరిగిందంటూ కొన్ని రాజకీయపార్టీలు ఆరోపిస్తున్న విషయం మనకి తెలిసిందే. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ విషయమై మాజీమంత్రి, ఒంగోలు మాజీ శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి కోర్టుని కూడా ఆశ్రయించారు. ఈవీ ప్యాడ్‌లని లెక్కబెట్టాలని కూడా ఆయన డిమాండ్ చేస్తున్నారు.

10లో

● బాబు ప్రభుత్వ ప్రతిష్టకి

## ఇసుకతో మసక!

- గత ప్రభుత్వంలోనే ధర తక్కువంటున్న వినియోగదారులు
- ప్రభుత్వం తొందరలోనే తగ్గిస్తుందంటున్న అధికారులు
- సందట్లో సడేమియాలా దోచేసుకుంటున్న దళారులు
- దోపిడీపై సమీక్ష జరిపిన ముఖ్యమంత్రి



"ఇసుక"... ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం ముందున్న అనేక సమస్యలు, సవాళ్లతో పోల్చిచూస్తే ఇదొక చిన్న అంశం. కానీ, ఈ చిన్న అంశమే పెద్దస్థాయిలో బాబు ప్రతిష్టని మసకబారుస్తోందన్న ఆందోళన అధికారపార్టీ నేతలలో కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇంకా వందరోజులు కూడా పూర్తికాలేదు. గత ప్రభుత్వం తవ్విన గోతుల లోతు తెలుసుకోవడానికే అధికారపార్టీ నేతలకి, ప్రభుత్వ అధికారులకి ఉన్న సమయం సరిపోవడం లేదు.

10లో




పారిశ్రామిక ప్రగతిలో మేటి...
ఉపాధి కల్పనలో తనకి తానే సాటి..

## శ్రీసిటీ

అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



పలు ప్రారంభోత్సవాలకి, నిర్మాణాలకి, ఒప్పందాలకి శ్రీకారం

### రూ. 3,683 కోట్ల పెట్టుబడితో మరో 15,280 మందికి ఉపాధి

**అంతరిక్ష పరిశోధనా కేంద్రం శ్రీహరికోటతో పాత నెల్లూరుజిల్లాలోని సూళ్లూరుపేట ప్రాంతం దశాబ్దాల క్రితం ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. అయితే, ఇప్పుడు శ్రీసిటీ ప్రత్యేక పారిశ్రామికవాడ అనూహ్యమైన అభివృద్ధిని తన సొంతం చేసుకుంటూ.. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాన్ని అంతర్జాతీయ పారిశ్రామిక కూడలిగా మారుస్తోంది. భారీ పరిశ్రమల స్థాపనలో మేటిగా, ఉద్యోగ ఉపాధి కల్పనలో తనకి తానే సాటిగా ప్రపంచస్థాయి ప్రత్యేక ఆర్థికమండలిగా శ్రీసిటీ ఎదుగుతోంది. ఇప్పటికే 30దేశాలకి చెందిన 220 ప్రతిష్టాత్మక సంస్థలు తమ పరిశ్రమలని శ్రీసిటీలో ప్రారంభించాయి. ఆయా సంస్థల ద్వారా 62వేల మంది ఉపాధి పొందుతుంటే.. వారిలో 50 శాతం మంది మహిళలే కావడం విశేషం.**

ఆగష్టు19న శ్రీసిటీని సందర్శించిన ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన చేతులమీదుగా మరో 15 పరిశ్రమలని ప్రారంభించారు. కొత్తగా 7 కర్మాగారాలకు శంఖుస్థాపన చేశారు. త్వరలో మరో 5సంస్థలు తమ కార్యకలాపాలకి శ్రీసిటీని వేదిక చేసుకోబోతున్నట్లుగా ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఈనెల 19న శ్రీసిటీలో జరిగిన ప్రగతి ఉత్సవాలు పండుగ వేడుకను సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు రాక, అనేకమంది ప్రముఖులు, పారిశ్రామికవేత్తలతో శ్రీసిటీ కళకళలాడింది. ఈ సందర్భంగా శ్రీసిటీ పరిశ్రమల సీఈఓల రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం మాట్లాడుతూ, విజన్ 2047తో ముందుకు వెళుతున్న భారతదేశంలో కొత్త ఆవిష్కరణలతో, భారీ పెట్టుబడులతో పారిశ్రామికవేత్తలు ఆంధ్రలో పెట్టుబడులు పెట్టేందుకు తరలి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనేక భౌగోళిక వసతులు, ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి పెద్ద పీట వేసేలా ఆంధ్ర రాష్ట్రంలో సరికొత్త పారిశ్రామిక విధానం మరో 20 రోజుల్లో అమలులోకి రానుందని చెప్పారు. పెట్టుబడులు, భారీ ఉపాధి లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానంతో రాష్టంలో పారిశ్రామికాభివృద్ధికి పెద్ద పీట వేయనున్నట్లు చెప్పారు.

10లో

### జూ.డాక్టర్ హత్యోదంతంపై..

# వెల్లువెత్తుతున్న నిరసనలు

**• నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ఆందోళనలు**



కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘోరమని, ఆ దారుణానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ నెల్లూరులో ఉధృతంగా ఆందోళన జరుగుతోంది. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద జూనియర్ డాక్టర్లు పెద్దఎత్తున నిరసనలు తెలియజేస్తున్నారు. కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యం ఘోరమని, అయినా మమతాబెనర్జీ నాయకత్వంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వంలో చలనం లేదని, దారుణం జరిగి పది రోజులు గడుస్తున్నా నిందితులను పట్టుకోలేకపోవడం ఏమిటని వారు మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా జోక్యం చేసుకుని ఆ ఘటనపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రొఫెసర్ కలేషాబాషా ఆధ్వర్యంలో జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మెకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మద్దతు ప్రకటించారు. స్థానిక రామచంద్రారెడ్డి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దత్తాత్రేయ, డీఐఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు తరలి వచ్చి ఆ ఆందోళనకు తమ మద్దతు ప్రకటించారు. వైద్యులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కోరారు. ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీచస్ జోయల్, కార్యదర్శి డాక్టర్ హితేష్‌యాదవ్, డాక్టర్ ఉత్తమ్‌కుమార్, డాక్టర్ తేజస్విని, డాక్టర్ అబిద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

**అకృత్యం హేయం :**

కలకత్తాలో జూ.డాక్టర్‌పై జరిగిన అకృత్యం హేయమని, నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈనెల 19నఈ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్‌సి కూడలి నుంచి ముత్తుకూరు గేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని, ఆ ఘటనలకు నిరసనగా నినాదాలు చేశారు. ఐక్యవేదిక కన్వీనర్ శివపార్వతి, న్యాయవాది ఝాన్సీ, డాక్టర్ రఫీ, న్యాయవిద్యార్థి మాధవి పాల్గొన్నారు.

## ఇదెంతో అమానవీయ ఘటన

**మెడికవర్ ఆసుపత్రుల ఛైర్మెన్ డాక్టర్ అనిల్‌కృష్ణ ఆవేదన**




కలకత్తా ఘటన ఎంతో ఘోరమని, అది అమానవీయమైన ఘటన అని మెడికవర్ హాస్పిటల్స్ అధినేత, ఛైర్మెన్..డాక్టర్ అనిల్ కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా ఓపీ సేవలను బహిష్కరిస్తున్నామని, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపునిచ్చిన సమ్మెకు తమ ఆసుపత్రి పూర్తి మద్దతునిస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెడికవర్ ఆసుపత్రులలో ఇటీవల ఓపీ సేవలను బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 'ఈ సంఘటన అందరిని కలిచివేసింది అత్యంత హేయమైన ఈ ఘటనకు కారకులైన వారిని వెంటనే శిక్షించాలి' అని ఆయన పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్‌హెడ్ డా.బిందురెడ్డి మాట్లాడుతూ ఆ ఘటనను తాము పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.యేశ్వత్‌రెడ్డి, ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



## నరసింహన్ కళాకౌశలం అద్భుతం

**- అభినందించిన వెంకయ్య**

78వ స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా నెల్లూరు నగరానికి చెందిన 'సంతానం బుక్ డిపో' అధినేత కేసీ నరసింహన్ అట్ట ముక్కలతో తయారుచేసిన జాతీయ చిహ్నాన్ని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఇటీవల నెల్లూరు స్వర్ణభారత్ ట్రస్టులో ఆవిష్కరించి నరసింహన్ కళాకౌశలాన్ని అభినందించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, భారతీయ కళలు..సంస్కృతి పట్ల యువతకు మంచి అభిరుచి ఉండాలన్నారు. నరసింహన్ మూడు నెలల సమయాన్ని వెచ్చించి, తన మేధాశక్తితో భారత జాతీయ చిహ్నాన్ని అట్టముక్కలతో రూపొందించడం హర్షదాయకమన్నారు. అట్టముక్కలతో అందంగా రూపొందించిన ఈ జాతీయ చిహ్నం, కొత్త పార్లమెంట్ భవనంలో ఆవిష్కరించిన జాతీయ చిహ్నాన్ని పోలి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేంద్రరెడ్డి, ఉమామహేష్, రవిచంద్రన్, వేదాంత దేశికర్ దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ కేసి వరదరాజన్, ట్రస్ట్‌కి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## పేదల సేవలో 'నారాయణ ట్రస్ట్'

**నిరుపేదలకు తోపుడుబండ్లు అందజేసిన మంత్రి నారాయణ**



ఎన్నికల్లో తాము గెలిస్తే పేదలకు తమవంతు సేవ చేస్తామని, వారిని అన్నివిధాలా ఆదుకుంటామని మంత్రి నారాయణ ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఏర్పాటుచేసిన 'నారాయణ చారిటబుల్ ట్రస్ట్' ఈనెల 19న నెల్లూరులోని పలువురు పేదలకు సాయం అందించింది. తన కుమార్తె శరణితో కలసి మంత్రి నారాయణ నగరంలోని 23మంది పేదలకు తోపుడుబండ్లు, మరో 40 మందికి కుట్టుమిషన్లు అందజేశారు. నిరుపేదలకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో తాము ఇప్పటిదాకా 200 మందికి తోపుడుబండ్లు అందించామని మంత్రి నారాయణ తెలిపారు. మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

**షరీఫ్‌కు..రూ.లక్ష సాయం :**

ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న స్థానిక 42వ డివిజన్‌కి చెందిన బీఎల్‌వో షరీఫ్‌ను ఇటీవల మంత్రి నారాయణ పరామర్శించారు. షరీఫ్ నివాసానికి వచ్చి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, నేనున్నానంటూ తనవంతు లక్ష రూపాయలు సాయంగా ప్రకటించి, వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. షరీఫ్‌కి ఆరోగ్యపరంగా ఏం కావాలన్నా వెంటనే తమ ఆసుపత్రిలో చికిత్సలు అందించాలని ఆదేశించారు. మంత్రి వెంట జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కవులకు పురస్కారాలు

**పద్య, వచన కవితల పోటీల్లో విజేతలకు బహుమానాలు**



ఇందుకూరుపేట మండలం మైపాడు గ్రామానికి చెందిన ప్రముఖ కవి, చిత్రకారుడు పేరిశెట్ల శివకుమార్ తమ తల్లిదండ్రుల పేరుతో ఈనెల 18న ఇందుకూరుపేటలోని కల్యాణమండపంలో, సరస్వతీపుత్ర కళాపీఠం ఆధ్వర్యంలో పలువురు కవులు, కవయిత్రులకు పురస్కారాలను అందజేశారు. తన షష్టిపూర్తిని పురస్కరించుకుని పద్య కవితలు, వచన కవితల్లో ఆయన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ అవధాన కవి సూరం శ్రీనివాసులు, రాధేయ, గంగిశెట్టి శివకుమార్, మన్నెం సతీష్, ఏ.జయప్రకాష్, గోవిందరాజుల సుభద్రాదేవి, సజ్జా వెంకటేశ్వర్లు పాల్గొని పురస్కార గ్రహీతలను సన్మానించారు.

**పురస్కార గ్రహీతలు వీరే..**

పద్య కవితల్లో అనంతపురానికి చెందిన ఆమళ్ళదిన్నె వెంకటరమణప్రసాద్ ప్రథమ బహుమతి సాధించగా, నెల్లూరుకు చెందిన సిహెచ్‌వి బృందావనరావు ద్వితీయ బహుమతిని, రాజమండ్రికి చెందిన బిహెచ్‌వి రమాదేవి తృతీయ బహుమతిని, వచన కవితల్లో నాయుడుపేటకు చెందిన తన్నీరు శశికళ ప్రథమ బహుమతిని, విజయనగరానికి చెందిన ఉత్పలిని ద్వితీయ బహుమతిని, కాకినాడకు చెందిన పొత్తూరు సీతారామరాజు తృతీయ బహుమతిని అందుకున్నారు. చయనం అరుణాశర్మ (బెంగుళూరు), ఇంద్రగంటి మధుసూదన్‌రావు (నెల్లూరు)లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పేరిశెట్ల శివకుమార్-అరుణకుమారి దంపతులను ప్రముఖులు ఆశీర్వదించారు.



### యాచేంద్రతో..

## రామ్‌కుమార్ భేటీ

తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఇటీవల వెంకటగిరి రాజా సాయికృష్ణ యాచేంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటగిరిలోని రాజావారి బంగ్లాలో వారు సమావేశమై, పలు అంశాలపై చర్చించుకున్నారు.

## ఘనంగా రక్షా బంధన్

నెల్లూరులోని కొండాయపాలెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఇటీవల ఘనంగా రక్షా బంధన్ నిర్వహించారు. అన్నా చెల్లెలు, అక్కా తమ్ముడు బంధానికి ప్రతీకగా విద్యార్థులకు రాఖీలు కట్టించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

## మంత్రిని కలిసిన.. విఎస్‌యు ఉపకులపతి



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్. విజయభాస్కరరావు ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి, పరిశోధన తదితర విషయాలను ఆయనతో చర్చించారు. విశ్వవిద్యాలయానికి అవసరమైన సహాయాన్ని అందిస్తానని మంత్రి ఉపకులపతికి హామీ ఇచ్చారు.



## తిరుమలేశుని సేవలో..
# చిరంజీవి, 'ఆనం' కుటుంబీకులు

ఈనెల 22 గురువారం నాడు ప్రముఖహీరో.. మెగాస్టార్ చిరంజీవి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు కుటుంబ సమేతంగా కలిసి కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలను నిర్వహించి స్వామివారి ఆశీస్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కొండ్రెడ్డి రితేష్‌కుమార్‌రెడ్డి, ఆనం కైవల్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆగస్టు 22న చిరంజీవి 69వ పుట్టినరోజు కావడం విశేషం!

# పామాయిల్ ఫ్యాక్టరీలో..అగ్నిప్రమాదం

ముత్తుకూరు మండలం పంటపాళెంలో వద్ద ఉన్న ట్రిపుల్‌ఎఫ్ పామాయిల్ ఫ్యాక్టరీలో ఈనెల 21వతేదీ రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ప్లాంట్‌లో ఉష్ణోగ్రతలు పెరిగి ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. బాయిలర్ పేలుడుతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఆ సమయంలో పెద్ద శబ్దం వచ్చిందని చెప్తున్నారు. భారీ పేలుడుతో ఫ్యాక్టరీ అంతా దట్టమైన పొగ, మంటలను చూసి కార్మికులు బెంబేలెత్తిపోయారు. పక్కనే ఉన్న వరిపొట్టు నిల్వలకు కూడా మంటలు అంటుకోవడంతో భయానక వాతావరణ అలముకుంది. సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. రాత్రివేళ కార్మికులెవరూ అక్కడ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పినట్లయింది. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి, రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తదితరులు ప్రమాదస్థలాన్ని సందర్శించి మంటలను అదుపులోకి తెచ్చారు.

# సోమశిల నుంచి కండలేరుకు నీళ్ళు

జిల్లాలోని సోమశిల జలాశయం నుంచి కండలేరు రిజర్వాయర్‌కు ఈనెల 21న నీటిపారుదలశాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకటరమణారెడ్డి నీటిని విడుదల చేశారు. దక్షిణ కాలువ వద్ద పూజలు చేసి, కండలేరుకు 2వేల క్యూసెక్కుల నీటిని పంపారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు బాగా కురుస్తుండడంతో 9 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్న సోమశిల రిజర్వాయర్ నీటిమట్టం ఈనెల 21 నాటికి 26.92 టీఎంసీలకు పెరిగిందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

## 'అన్న క్యాంటీన్'కు..
# రూ.లక్ష విరాళం

పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'అన్న క్యాంటీన్'లకు నెల్లూరులోని హరనాథపురానికి చెందిన దాత సీహెచ్ శ్రీనివాసులురెడ్డి ఈనెల 21న లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆ విరాళం చెక్కునందించారు.

## కేవన్నార్ స్కూల్ ఘటనపై..
# త్రిసభ్య కమిటీ

నెల్లూరులోని కేవన్నార్ మునిసిపల్ స్కూల్‌లో సన్‌షేడ్ కూలిపోయి, విద్యార్థి గురుమహేంద్ర మృతిచెందిన ఘటనపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. డీఇఓ, అడిషనల్ కమిషనర్, సమగ్రశిక్ష ఇంజనీరింగ్ అధికారితో కలిపి త్రిసభ్య కమిటీని నియమించారు. వీరు ఆ ఘటనను పూర్తిస్థాయిలో విచారించి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు. వాస్తవాలను పరిశీలించి ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోనున్నారు.

## సమాచారశాఖ డీడీపై..
# నిప్పులు చిమ్మిన 'చంద్ర'బాబు



'డెప్యూటి డైరెక్టర్ జిల్లాలో ఉన్నాడా?..ఏం చేస్తున్నాడు?..బీ కేర్‌ఫుల్'..అంటూ సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెల్లూరులోని సమాచార ప్రసారశాఖ డెప్యూటి డైరెక్టర్ సదారావుపై నిప్పులు చెరిగారు. 'అందరూ ఇలాగే తయారయ్యారు. అడ్మినిస్ట్రేషన్‌ను భ్రష్టుపట్టించారు'.. అంటూ ఆయన అసహనం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 19న నెల్లూరుజిల్లాలోని సోమశిల ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజావేదికలో ముఖ్యమంత్రి రైతులతో మాట్లాడుతున్నప్పుడు మైక్ సరిగా పనిచేయకపోవడంతో సంబంధిత అధికారిపై ఆయన మండిపడ్డారు. 'నువ్వేమీ ప్రేక్షకుడివి కాదు.. ఇవన్నీ నువ్వే చూసుకోవాలి' అంటూ, 'వెరీక్లియర్.. అడ్మినిస్ట్రేషన్ నిద్రపోతోంది. మర్యాదగా చెప్తే అర్థం కావడం లేదు.. మర్యాద అయిపోయింది. ఇక యాక్షన్ ఉంటుంది' అని ముఖ్యమంత్రి ఆగ్రహంగా అన్నారు. దీంతో అక్కడున్న అధికారులు, ఉద్యోగులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సాధారణంగా సీఎం పర్యటనలకు సమాచార శాఖ వారే పాత్రికేయు లను తీసుకువెళ్తుంటారు. ఆ సమయంలో కాఫీలు తాగారా.. టిఫినీలు తిన్నారా? అని పదేపదే తిండి విషయంలో చూపించే శ్రద్ధ.. రాష్ట్ర ముఖ్యమంత్రికి మైక్ ఏర్పాటు చేయడంలో లేకపోవడం ఏమిటంటూ.. అక్కడున్నవారు ఆ డీడీ పనితీరుపై గుసగుసలాడుకోవడం కొసమెరుపు!

# పారిశ్రామిక హబ్‌గా..జిల్లా! - ఎంపీ వేమిరెడ్డి





త్వరలోనే నెల్లూరుజిల్లా పారిశ్రామిక హబ్‌గా మారుతుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. జిల్లాలో పరిశ్రమలు పెట్టేందుకు అనుకూల పరిస్థితులున్నాయని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్టంలో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని ఆయన చెప్పారు. కొండాపురం మండలం సాయిపేట గ్రామంలో ఈనెల 22వ తేదీ గురువారం జరిగిన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. రాష్టంలో రోడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తున్నారని చెప్పారు. అనంతరం స్థానిక సమస్యలపై ఆయన గ్రామస్థులతో చర్చించారు. జడ్పీ మాజీ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.




ఆత్మీయ అభినందనలు

గత 50 సంవత్సరాలకి పైగా
దంత వైద్యంలో ప్రఖ్యాతిగాంచిన
డా॥ యం.హరిశ్చంద్రారెడ్డి గారి
దీవెనెలతో...

గత 30 సంవత్సరాలుగా దంతవైద్య సేవలందిస్తున్న
మా కుటుంబ ఆప్తుడు, ఆత్మీయుడు
డా॥ యం.శ్రీనాథ్‌రెడ్డి
M.D.S.(Ortho)
అధునాతన వసతులతో
అత్యాధునిక దంత వైద్య విధానాలతో

శ్రీనాథ్ దంత వైద్యశాల

నెల్లూరు, పొగతోట, ఎస్2 సినిమాహాళ్ళ రోడ్డులోని
సుమ స్కిన్ & లేజర్ క్లినిక్ మిద్దెపైన
Tel. 0861-2328060, Mob. 73861 89046

ప్రారంభిస్తున్న శుభతరుణంలో
నా అభినందనలు, ఆశీస్సులు.



పెనుబోలు రాజగోపాలరెడ్డి
నెల్లూరు.

SRINATH
DENTAL CLINIC
A unit of Dr. HARISCHANDRA REDDY DENTAL HOSPITAL



లాయర్
ఆగస్టు 23, 2024

# మృత్యు లోగిళ్లుగా.. అనధికార హాస్టళ్లు!

పాఠశాలలకు, హాస్టళ్ళకు, లేదా ఆశ్రమాలకు వెళ్ళి చదువుకునే విద్యార్థులకు కూడా ఇప్పుడు ముప్పు తప్పడం లేదు. మృత్యువు ఏ రూపాన కాసుకుని కూచుని ఉందో, ఎవరిని కాటేస్తుందో తెలియడం లేదు. ప్రభుత్వాలు, పాలకుల అలక్ష్యం, అధికారుల నిర్లక్ష్యం మూలంగా దేశంలో అనేకచోట్ల అనధికార హాస్టళ్లు పుట్టుకొచ్చి, విద్యార్థుల పాలిట యమపాశాలుగా తయారవుతున్నాయి. వాటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో, వాటి నిర్వాహకులదే ఇష్టారాజ్యమైపోయింది. ఈ వసతి గృహాల్లో ఏ ఘోరం జరిగినా, నేరం జరిగినా, చివరికి ప్రాణాలే పోయినా పట్టించుకునే దిక్కు లేదు. మొన్నటికి మొన్న ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా నర్సీపట్నం డివిజన్‌లోని కైలాసపట్నంలో ఉన్న ఓ అనధికార హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు అత్యంత దయనీయస్థితిలో ప్రాణాలు కోల్పోయారు. అందులో ఇద్దరు బాలికలు, ఒక బాలుడు ఉన్నారు. దాదాపు మరో 30 మందికి పైగా విద్యార్థుల పరిస్థితి విషమంగా మారింది. ఈ విద్యార్థులంతా ఆదివాసీ పిల్లలే. అన్నం పెట్టి చదువు చెప్తామంటే.. ఆశపడిన తల్లి తండ్రులు వారిని ఆ అనధికార వసతిగృహానికి పంపారు. 'అనాధాశ్రమం' పేరుతో నడుస్తున్న ఆ రేకుల షెడ్డులో అక్షరాలు నేర్చుకోకముందే ఆ చిన్నారులు కలుషిత ఆహారానికి బలైపోయారు. దీంతో వారి తల్లితండ్రుల వేదనారోదనలకు అంతే లేదు. తీరాచూస్తే, ఆ వసతి గృహానికి ఎలాంటి అనుమతులు లేవని అధికారుల పరిశీలనలో తేలింది. ప్రైవేటు వ్యక్తులు నడుపుతున్న అనేక ఆశ్రమాలు, వసతి గృహాలు, పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఒక్క మన రాష్ట్రంలోనే కాదు, దేశంలో అనేక ప్రాంతాల్లో ఈ దుస్థితి ఉంది. పిల్లలను స్కూళ్ళకు పంపాలన్నా, హాస్టళ్ళకు పంపాలన్నా, దిక్కులేక ఏ అనాధాశ్రమానికి పంపాలన్నా తల్లితండ్రులు భయపడే పరిస్థితి వచ్చేసింది. ఎక్కడ ఎవరు ఏ హాస్టల్ పెట్టినా, అనధికారికంగా ఇలాంటి ఆశ్రమాలు నడిపినా.. అవి ఏవిధంగా నడుస్తున్నాయో, వాటి వెనుక ఏ కథ నడుస్తోందో కనీసం పరిశీలించే నాధులు కూడా లేకపోవడం ఘోరం. ఆ బలహీనతనే ఆధారంగా చేసుకుని వాటి నిర్వాహకులు చిత్తానుసారం వ్యవహరించడం సర్వసాధారణమైపోయింది. ఎవరో కొద్దిమంది సమాజసేవకులు మాత్రం మానవతాదృక్పధంతో అనాధలను తమ బిడ్డలుగానే పరిగణిస్తూ వారికి ఆశ్రయమిచ్చి పోషిస్తున్నారు. కొంతమంది దాతల సహకారంతో ఆశ్రమాలు నడుపుతున్నారు. కానీ నిర్వహణకు నిధుల్లేక నీరసపడిపోతున్నారు. కాలక్రమేణా వాటిని సక్రమంగా నడపలేక మధ్యలోనే గాలికి వదిలేస్తున్నారు. అనాధలు, అభాగ్యులకు పుట్టినిల్లయిన మనదేశంలో కోట్లాది మంది వయోవృద్ధులు, చిన్నారులు నేటికీ..ఎవరో పెట్టే పిడికెడు మెతుకుల కోసం ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు. అన్నం పెట్టే దాతల కోసం ఆర్తిగా నిరీక్షిస్తున్నారు. అనాధాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు, వసతి గృహాలకు ప్రభుత్వాల నుంచి కానీ, పాలకుల నుంచి కానీ ఎలాంటి ఆదరణా లేకపోవడం, వాటి ఆలనాపాలనకు అవసరమైన చేయూతనివ్వకపోవడంతో సమాజంలో ఎంతోకాలంగా ఇలాంటి దుస్థితులు మారడమే లేదు. ఆశ్రమాల్లోనే కాదు, అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ హాస్టళ్ళలో, గురుకులాల్లో, నిరుపేద బాలబాలికలుండే హాస్టళ్ళలో వాస్తవానికి నేటికీ ఎలాంటి వసతులు ఉండడం లేదు. కంపుకొట్టే పరిసరాలు, పాసిపోయిన అన్నం నీళ్ళు, ఉడికీ ఉడకని మెతుకులు, చలికి వణుకుతున్నా దుప్పట్లు కూడా అందని దయనీయ పరిస్థితులు సమసిపపోవడం లేదు. ఎక్కడ ఏ పాఠశాల లేదా హాస్టల్‌ను చూసినా ఇదే తంతు. ఆయా గ్రామాల్లో అధికారులు లేదా వార్డెన్లకు జడిసి నిజాలు బయటకు చెప్పలేక పాఠశాలల విద్యార్థులు తమ కష్టాలను కన్నీళ్ళను గుండెలోతుల్లోనే దిగమింగుకుంటున్నారు. ఇవన్నీ అందరికీ తెలిసిన బహిరంగ రహస్యాలే. అయినా ఎవరు పట్టించుకుంటున్నారు?..ఇకనైనా కేంద్రం, రాష్ట్రప్రభుత్వాలు వాటిపై దృష్టి పెట్టి, వాటి నిర్వహణను గాడిలో పెట్టాలి. హాస్టళ్లలో చేరే పేద విద్యార్థులకు, అభాగ్యులు.. అసహాయులకు అన్ని విధాలా సాయమందించాలి. వారి చదవులకు, జీవితాలకు భద్రతను.. భరోసాను కలిగించాలి. పాఠశాలలు, హాస్టళ్ళు లేదా ఆశ్రమాలు ఏవైతేనేం?..విద్యార్థులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేని వాతావరణం ఉండేలా చూడాలి. వాటి నిర్వహణను క్రమబద్ధం చేస్తూ ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. అధికారులతో కూడిన పర్యవేక్షక బృందాలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వాటి నిర్వహణ తీరును పరిశీలిస్తూ, విద్యార్థుల భవితకు మార్గదర్శకంగా ఉండే రీతిలో వాటిని చిత్తశుద్ధితో సంస్కరించాల్సి ఉంది. లేకుంటే.. ఇలాంటి మరణమృదంగాలు ఆగకుండా మోగుతూనే ఉంటాయి.




# మోసగాళ్లున్నారు జాగ్రత్త...!

నూటనలభై కోట్ల జనాభా వున్న భారతదేశంలో స్కాములు, స్కీములు, అంతర్జాల మోసాలు రోజురోజుకీ పెరిగిపోతూనే వున్నాయి. మోసం చేసేవారి లక్ష్యానికి మోసపోయేవారి బలహీనత తోడై నేరాలు, ఘోరాల సంఖ్యకి హద్దు లేకుండా పోతోంది. "మోసానికి కాదేది అనర్హం" అన్నట్లుగా మోసగాళ్లు అనేక మార్గాలని ఎన్నుకుని ప్రజలని దోచుకుంటున్నారు.

రూపాయికి రెండు రూపాయలు ఇస్తామంటే.. ఎవరికైనా ఆశే. అలాంటిది, ఒకటికి పదిస్తామంటే ఇంక చెప్పాల్సిన పనేలేదు. మరి వందకి లక్ష ఇస్తామంటే ఇంకెంత సంబరమో చెప్పలేం. అది స్కీమ్ అయినా, స్కామ్ అయినా తర్వాత సంగతి, పోతే వందే కదా పోతుంది అనుకని రంగంలోకి దిగేస్తారు. కళ్ళు మూసి తెరిచేలోగా మోసపోయామని తెలుసుకుంటారు. ఇదీ నేటి సాటి మానవుడి తీరు. ఈ ధనవ్యామోహాన్ని అలుసుగా తీసుకుని, మోసగాళ్లు రకరకాల స్కీములతో.. స్కాములకి తెరలేపుతూనే ఉన్నారు. ప్రజల బలహీనతే వారికి బలమైన పెట్టుబడి. నిజాలు చెప్తే ఎవరూ నమ్మరు కానీ, కట్టుకథలు చెప్తేమటుకు భలేగా నమ్మేసే దౌర్భాగ్యపు కాలమిది. ఇదే అదనుగా స్కీమ్‌ల పేరుతో మాయచేస్తున్నవారు జనాల నుంచి రూ.కోట్లు లాగేసుకుని ఆ తర్వాత పత్తా లేకుండా పోతున్నారు.

వంద కడితే లక్ష రూపాయలు వస్తాయంటే అదెట్లా సాధ్యమవుతుందని కూడా ఒక్క క్షణం ఆలోచించకుండా విచక్షణ కోల్పోయి అలాంటి స్కీముల మాయలో పడేవారిని ఏమనాలి? స్కీముల నిర్వాహకులు బోర్డులు తిరగేసి అడ్రసులేకుండా పోతే తప్ప, మనోళ్ళకి కనువిప్పు కలగడంలేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం ప్రయోజనం? పోలీసులు, అధికారులు అలాంటి మాయలమరాఠీల మోసపు స్కీమ్‌ల జోలికి వెళ్లొద్దంటూగొంతు చించుకుని చెప్తూనే ఉన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా చైతన్యం కలిగిస్తూనే వున్నారు. అయినా బుద్ధి రాకపోతే ఎలా?

## మన చుట్టూనే మాయలమరాఠీలు!

ఎక్కడో కాదు, ఎంతోమంది మోసగాళ్లు మోసాల వలలు పట్టుకుని మన చుట్టూరానే ఉంటారు. అమాయక జనాన్ని బురిడీ కొట్టించి, చీటీల వ్యాపారాలతో కోట్లు మూటగట్టుకుని పరారయ్యే వారు కొందరైతే, మన ఇళ్లల్లో ఉన్న బంగారానికి మెరుగుపెడతామని ఆడవాళ్ళని మోసంచేసి, మనింట్లోనే కూర్చుని అందినంత బంగారాన్ని దోచుకుని ఉడాయించేసేవాళ్ళు ఇంకొందరు. పల్లెల్లోనే కాదు, పట్టణాల్లో సైతం ఈ తరహా మోసాలు జరుగుతున్నాయి.

## జబ్బుల్ని కూడా డబ్బులు చేసుకుంటున్నారు!

ఓ వైపు అనారోగ్యంతో కుయ్యోమొర్రోమంటుంటే, అది తెలుసుకుని.. పూజలు చేసి, మంత్రం వేసి ఆరోగ్యం బాగుచేస్తామని చెప్పి డబ్బులు గుంజుకునే ముఠాలు కూడా తయారవుతున్నాయి. వేలరూపాయలు పెట్టి టీవీలలో ప్రకటనలు కూడా ఇస్తున్నాయి. చెడు నివారణ, క్షుద్ర పూజలు, నరదిష్టి, దెయ్యాలు, భూతాలు అంటూ జనాన్ని భయపెట్టి సొమ్ముచేసుకుంటున్నాయి. జనం బలహీనతలపైన వ్యాపారం చేసుకుని పబ్బం గడుపుకుంటున్నాయి. ఘరానా మోసగాళ్లని ఇళ్లలో కూర్చోబెట్టి, వారి చేత పూజలు చేయించుకుని, వారు అడిగినంత డబ్బుని, బంగారాన్ని తెచ్చిచ్చి, ఆ దుర్మార్గులు మన కళ్ళ ముందే పారిపోతుంటే అమాయకంగా చూసే జనం వున్న సమాజం మనది. అవసరానికి అప్పు తీసుకుని, ఆ తర్వాత దానికి వడ్డీ మీద వడ్డీ అంటూ చక్ర వడ్డీలు కట్టుకుంటూ అప్పిచ్చిన వారి కబంధహస్తాల్లో చిక్కుకుని అల్లాడిపోతున్న వారు కూడా ప్రస్తుత సమాజంలో కోకొల్లలుగా ఉన్నారు.

## మోసం చేసేవాళ్ళనే నమ్ముతున్నాం..

నిజానికి ఎవరూ కావాలని మోసపోరు. కానీ మోసం చేసేవారు మాత్రం మోసం చేసే ఉద్దేశ్యంతోనే మన దగ్గరకి వస్తారు. నమ్మించి నట్టేట ముంచడం అన్నది వాళ్లకి వెన్నతో పెట్టిన విద్య. ఎదుట వ్యక్తి ఎలాంటివాడు అన్నది పసి కట్టాల్సింది మనమే. నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని చెప్పేవాళ్ళు, విదేశాలకి పంపిస్తామని మాయ మాటలు చెప్పేవాళ్ళు, కాలేజీలలో సీట్లు ఇప్పిస్తామని బురిడీ కొట్టించేవాళ్ళు, మీచేత చార్మినార్ కొనిపిస్తాం అని చెప్పి బోల్తా కొట్టించేవారు... ఇలా చాలామంది మాయల మరాఠీలు మన మధ్యనే తిరుగుతుంటారు. దొరికిన మేరకి దోచుకుని మాయమైపోతుంటారు. ఎన్ని చేదు అనుభవాలు మనకి ఎదురైనా మనం ఇంకా మోసం చేసేవాళ్లనే నమ్ముతున్నామంటే అది వారి తప్పు కాదు... మన బలహీనత. కొన్ని సంఘటనలలో మోసపోయామని తెలిసినా ఆ విషయం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారు. ఇక అలాంటప్పుడు ఈ నేరాలు మోసాలు ఎలా తగ్గుతాయో మనమే ఆలోచించుకోవాలి. ఇదే అదనుగా మోసగాళ్లు పేట్రేగిపోతున్నారు. రైళ్లలోనో, బస్సులలోనో మనకి పరిచయమై మాటమాటా కలిపి, ఆ తర్వాత మనదగ్గరున్న డబ్బూ దస్కం దోచుకొనిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కేవలం సామాన్య, మధ్యతరగతి వాళ్లే కాకుండా, ధనవంతులు, మేధావులు కూడా పప్పులో కాలేసి ఎక్కడో ఒకదగ్గర రకరకాల మోసాలకు గురవుతూనే ఉన్నారు. తీరా మోసపోయాక తాము మోసపోయామని చెప్పుకోవడానికి కూడా అవమానంగా భావించి విషయాన్ని మింగేస్తున్నారు. ఇటీవలి కాలంలో స్మార్ట్‌ఫోన్ల రూపంలో ప్రపంచం అరచేతిలోకి వచ్చేశాక, రుణయాప్‌లు రావడం, వాటి ప్రలోభాలకి లొంగిపోవడం, చివరికి ఆ బాధలు పడలేక ఆత్మహత్యలు చేసుకోవడం వంటి సంఘటనలు కూడా తరచూ జరుగుతూనే ఉన్నాయి.

ఒక విధంగా చెప్పాలంటే మోసం చేసేవారికంటే మోసపోయే వారిదే ఎక్కువ తప్పు. మనం ఆశకిపోతున్నాం కాబట్టే అవతలివారు మనల్ని మోసం చేయగలుగుతున్నారు. అంతర్జాలంలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దు అని ప్రభుత్వం గొంతు చించుకుని అరిచి చెప్తున్నా మనం వినడంలేదు. చదువుకుని, ఉన్నత ఉద్యోగాలు చేసి రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులు సైతం తప్పుడు మెసేజీల బారిన పడి బ్యాంకు అకౌంట్లనీ ఖాళీ చేసుకుంటున్నారు. ఇందులో తప్పెవరిది..? మనది కాదా..?? అందుకే స్కీములైనా, స్కాములైనా.. వాటికి సూత్రదారులు కూడా మనుషులే. చాలామంది ఇళ్ల ముందు "కుక్కలున్నాయి జాగ్రత్త" అని బోర్డులు పెట్టినట్లుగా, ప్రభుత్వాలు కూడా "మోసగాళ్ళున్నారు జాగ్రత్త" అని తరచూ హెచ్చరిస్తూనే ఉన్నాయి. మోసపోదామా వద్దా అన్నది మన చేతుల్లోనే ఉంది. తస్మాత్ జాగ్రత్త..!

- రాజశ్రీ

# బహిరంగ మరణశిక్ష విధానం రావాలి!

కలకత్తాలోని ప్రైవేటు వైద్య కళాశాలలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్న వైద్య విద్యార్థినిపై మానవ పిశాచాలు చేసిన లైంగిక దాడి, హత్య అమానుషం. అత్యంత నీచాతినీచంగా ఒక అమాయకురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడం ఘోరాతిఘోరమైన చర్య. పరాకాష్టకి చేరుతున్న పైశాచికత్వానికి ఈ సంఘటన ఒక నిదర్శనం. ఈ సంఘటనలో అనేక ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదని, పథకం ప్రకారం జరిగిందేనని దర్యాప్తులో తేలుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాలేజీ యాజమాన్యానికి, అక్కడ పనిచేసే సిబ్బందికి ఈ సంఘటనలో భాగస్వామ్యం ఉందని కూడా దర్యాప్తు బృందాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదే నిజమైతే దోషులు ఎంతటివారైనా సరే నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేయాలి. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారికంటే, అందుకు ప్రేరేపించిన వారిని ముందు ఎన్‌కౌంటర్ చేసి పారేయాలి. ఇలాంటి సంఘటనలలో కూడా అరెస్టులు, కోర్టులు, విచారణలు, జైళ్లు, బెయిళ్ళు.. అంటూ కాలయాపన చేయడం మంచిది కాదు. అవసరమైతే మన చట్టాలలో మార్పు చేసి గల్ఫ్, సింగపూర్ లాంటి దేశాల తరహాలో మన దేశంలో కూడా బహిరంగ మరణశిక్ష విధానాన్ని అమలులోకి తీసుకురావాలి. ఎవడైనా మగవాడు తప్పుడి ఆలోచనతో ఆడపిల్ల వైపు కన్నెత్తి చూడాలంటే వణికిపోయేలా భయాన్ని కలిగించాలి. కలకత్తా సంఘటనలో బలైపోయిన అభాగ్యురాలి ఆత్మశాంతికి ప్రార్థిస్తూ!

– డి.హరిత, గూడూరు.




lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# నేతల తీరు మారితే.. అధికారులు కఠినంగా మారుతారు!

ఇటీవల మన 'లాయర్'లో రాసినట్లుగా నెల్లూరు నగరం నరకంగా మారిపోయింది. ముఖ్యంగా రోడ్డు మార్జిన్లలో వ్యాపార కూడళ్లు అవతరిస్తుండడంతో రోడ్లు కాస్త పార్కింగ్ లాట్లగా మారిపోయాయి. చదువుకున్న మూర్ఖులు కూడా తమ వాహనాలని నడి రోడ్లపైన పార్కింగ్ చేసి షాపింగులు చేస్తున్నారు. టీ బంకుల దగ్గర కూడా రోడ్లపైనే వాహనాలు నిలిపేసి గంటలకొద్దీ బాతాఖానీ కొడుతున్నారు. వాహనం అడ్డం ఉన్నప్పుడు హారన్లు కొట్టినా వారికి వినపడదు. వినపడినా వినపడనట్లే నటిస్తారు. ఆటోలు, సిటీ బస్సుల ఆగడాలు కూడా మితిమీరిపోయాయి. ఎక్కడపడితే అక్కడ రోడ్డుకు అడ్డంగా ఆపేస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే.. తిరిగి అడిగినవారి మీదకే గొడవకు దిగుతున్నారు. నెల్లూరులో ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ వున్నా.. లేనట్లే. ఆ విభాగం పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ఎవరి వెనుక ఏ నాయకుడు ఉన్నాడో అన్న భయం పోలీసులను అలముకుంటోంది. కళ్ళముందే తప్పు జరుగుతున్నా..చూసీచూడనట్లే ఉండిపోతున్నారు. ఇందుకు కారణం రాజకీయ నాయకులు. చిన్న.. చిన్న విషయాల్లో సైతం వారి జోక్యం ఎక్కువ కావడంతో నెల్లూరులో పరిస్థితులు మరీ ఘోరంగా తయారయ్యాయి. నేతల తీరు మారితే అధికారుల తీరు మార్చుకుంటారు. అధికారులు కఠినంగా ఉంటే ప్రజలు తమకి తామే మారిపోతారు. తప్పంతా రాజకీయ నాయకులలోనే ఉంది. మార్పు వారితోనే మొదలవ్వాలి!

– ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.



# స్వర్ణభారత్ ట్రస్ట్ 23 ఏళ్ళ సేవా ప్రస్థానం..స్ఫూర్తిదాయకం

## • ప్రశంసించిన భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్




'స్వర్ణభారత్ ట్రస్ట్' 23 ఏళ్ళ ప్రస్థానం అంటే అంకెలు కాదని, అది ఒక స్ఫూర్తిదాయక గమనమని, భారతదేశ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కొనియాడారు. ఈ నెల 17న నెల్లూరుజిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆలోచనలు మహోన్నతమైనవని, వారు తమ జీవితాన్ని దేశం కోసం అంకితం చేశారని, అలాంటి వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. వారి హృదయం ఎప్పుడూ గ్రామీణ ప్రాంతాలతో మమేకమై ఉంటుందని, వారి మానస పుత్రికగా ఈ ట్రస్ట్ ఓ ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు. వారికి ప్రతి అడుగులో సహకరిస్తున్న శ్రీమతి ఉషమ్మ వారి విజయాల వెనుక ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారం లేకుండా 23 ఏళ్ళ పాటు ట్రస్ట్‌ను ఓ మహాయజ్ఞంలా నిర్వహించారని, దానికి ఎంతో నిబద్ధత కావాలని అంటూ, ఈ సందర్భంగా ఆయన స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్‌ను అభినందించారు. తొలుత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అక్షర విద్యాలయాన్ని సందర్శించి, అక్కడి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి వారిని అభినందించారు. అనంతరం అక్షర విద్యాలయం ఆవరణలోని సోమా నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడి శిక్షణార్థులతో ముచ్చటించి, నైపుణ్య కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత స్వర్ణభారత్ ట్రస్ట్‌కు వచ్చి, ట్రస్ట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన అడ్మిన్ బిల్డింగ్‌ను ప్రారంభించారు. అనంతరం ట్రస్ట్ ఆవరణలో మొక్కను నాటారు. స్వర్ణభారత్ ట్రస్ట్, భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న జైపూర్ ఫుట్ ఉచిత శిబిరాన్ని సందర్శించి కొందరికి కృత్రిమ అవయవాలను అందజేశారు. అనంతరం ట్రస్ట్ ఆవరణలో ఉన్న దంత వైద్యశాల, సాధారణ వైద్యశాలలను సందర్శించి వారి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి జీవన ప్రస్థానం ఛాయా చిత్ర ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరించారు.

### ఇది అందరి పండుగ - వెంకయ్య

స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవం అందరి పండుగ అని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రజల హర్షధ్వానాల మధ్య అన్నారు. 23 ఏళ్ళ క్రితం మిత్రుల సహకారంతో ప్రారంభమైన ఈ సంస్థ ద్వారా లక్ష మందికి పైగా నైపుణ్య శిక్షణను అందించామని, విద్య, నైపుణ్య శిక్షణతో పాటు మన భాష, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవటానికి స్వర్ణభారత్ ట్రస్ట్ నిబద్ధతో పని చేస్తోందని చెప్పారు. ముఖ్యంగా రైతులు నవీన పద్ధతులను అందిపుచ్చుకుని సాధికారతతో తల ఎత్తుకుని నిలబడటం తమ కలగా అభివర్ణించిన ఆయన, మహిళలు సైతం అదే సాధికారతతో తలెత్తుకు నిలబడాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీదా మస్తాన్‌రావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ చైర్మన్, శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, ట్రస్టీలతో సహ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## చంద్రబాబు మానవీయతకి నిదర్శనం...

# 'అన్న క్యాంటీన్లు'

**ఎన్టీఆర్ ఆశయాల బాటలో నడుస్తున్న సీబీఎన్**
**- కొనియాడిన విపిఆర్**



ఆకలేసిన వారికి అన్నం పెట్టడంలో వున్న తృప్తి ఇంక దేంట్లోనూ లభించదని, అన్న క్యాంటీన్ల ద్వారా పేదవారి ఆకలి తీర్చడం చంద్రబాబు మానవీయతకి నిదర్శనమని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కొనియాడారు. అయితే, గత ప్రభుత్వం వీటిని మూసివేసి పేదల కడుపు కొట్టిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అన్నా క్యాంటీన్లు తిరిగి ప్రారంభం కావడం సీఎం చంద్రబాబునాయుడి గొప్ప ఆలోచనలకు నిదర్శనమన్నారు. నెల్లూరు నగర పరిధిలోని కొత్తహాలు సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను జేసీ కార్తిక్‌తో కలిసి ఎంపీ వేమిరెడ్డి ఇటీవల పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌కు వచ్చిన పేదలకు ఆయనే స్వయంగా ఉపాహారం వడ్డించారు. అనంతరం జేసీ కార్తిక్, టీడీపీ నేతలు, నిరుపేదలతో కలిసి ఆయన కూడా టిఫిన్ చేశారు. అంతేకాదు, ఆ రోజు అన్నా క్యాంటీన్ ఖర్చును కూడా ఆయనే భరించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలో తాజాగా 99 అన్న క్యాంటీన్లు ప్రారంభం కావడం గొప్ప విషయమన్నారు. ముఖ్యంగా నెల్లూరు, కొత్తహాలు ప్రాంతంలో ఎక్కువగా ఆసుపత్రులున్నాయి కనుక, వాటికి వచ్చే వేలాదిమందికి అన్నా క్యాంటీన్ల ద్వారా కడుపు నిండుతుందన్నారు. ఇక్కడ 5 రూపాయలకు అందిస్తున్న నాణ్యమైన భోజనం బయట హోటల్లలో దాదాపు 150 రూపాయలు అవుతుందన్నారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 2 రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని కూడా అప్పట్లో అమలులోకి తెచ్చారని, పేదల ఆకలి తీర్చాలనే ఎన్టీఆర్ ఆశయాలను సీఎం చంద్రబాబు ఆచరిస్తూ, అన్న క్యాంటీన్లను అద్భుతంగా రూపుదిద్దారని ప్రశంసించారు. ఇంత శుచి, శుభ్రత గల ఆహారాన్ని సరఫరా చేస్తున్న 'హరే కృష్ణ ఫౌండేషన్'కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అన్నా క్యాంటీన్ల సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

నెల్లూరు నగరాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించడమే లక్ష్యంగా మంత్రి నారాయణ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. నెల్లూరు నగరంలోని పెన్నా బ్యారేజ్, తిక్కనపార్కు, పినాకిని పార్కు, తదితర ప్రాంతాలను రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల ఆకస్మికంగా పరిశీలించారు. తిక్కనపార్కు, పినాకిని పార్కు పరిసరాలను క్షేత్రస్థాయిలో మంత్రులు తనిఖీ చేశారు. వ్యాయామ వస్తువులను పరిశీలించారు. పార్కుల్లో ఆట వస్తువులు తుప్పు పట్టి ఉండడంపట్ల అసహనం వ్యక్తం చేశారు. సమీపంలోని ఫుట్‌బాల్ కోర్టును పరిశీలించి దానిని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. పెన్నా బ్యారేజీ వద్దకు చేరుకుని నదిలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, నాచు, తదితరాలను శుభ్రం చేయడంపై అధికారులకు సూచనలిచ్చారు. మంత్రి నారాయణ ట్యాబ్ ద్వారా రివర్‌ఫ్రంట్ అభివృద్ధిపై విశదీకరించారు. నదీపరివాహకప్రాంతాలు అభివృద్ధి చెందితే జరిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు బ్యారేజీ నుంచి పాతమున్సిపల్ ఆఫీస్ వెనుక ఉన్న పొట్టేపాళెం రోడ్డు వరకు రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నెల్లూరు బ్యారేజీ నుంచి పుత్తాఎస్టేట్ వరకు దాదాపు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పార్కుల్లో నూతన వస్తువులను ఏర్పాటు చేయడంతో పాటు సమీపంలోని ఫుట్‌బాల్ కోర్టును సైతం అభివృద్ధి చేస్తామన్నారు.

# త్వరలోనే 'చెత్త నుంచి విద్యుత్ ప్లాంట్'

**- వెల్లడించిన మంత్రి నారాయణ**



నెల్లూరులో త్వరలోనే చెత్తనుంచి విద్యుత్ ఉత్పత్తిచేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నగర కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజతో కలిసి కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ విభాగాలతో సమావేశమయ్యారు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేందుకు వివిధ అభివృద్ధి చెందిన దేశాల్లో వినియోగిస్తున్న ఆధునిక యంత్రాలను నగరంలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ప్రధానంగా సాలిడ్ వేస్ట్‌పై చైనా, జపాన్, సింగపూరు తదితర అనేక దేశాల్లో స్టడీ చేశామని, అభివృద్ధి చెందిన దేశాల్లో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్స్‌ని ఏర్పాటు చేస్తున్నారని, చెత్తనంతా తీసుకువెళ్లి ఆ ప్లాంట్‌లో వేస్తే అందులోంచి విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు. అదేవిధంగా, విశాఖపట్నం, విజయవాడ కార్పొరేషన్‌లు అవలంబిస్తున్న విధానాలను నెల్లూరు నగరంలో కూడా అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని, నగరాభివృద్ధికి కావాల్సిన వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. నగరంలో కుక్కలు, కోతులు, పశువుల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

### ఫ్లెక్సీలు ఎక్కడంటే అక్కడ కట్టకూడదు

నెల్లూరు సిటీ స్మార్ట్‌గా మారాలంటే... ఫ్లెక్సీలను ఎక్కడ పడితే అక్కడ పెట్టకూడదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎక్కడా ఫ్లెక్సీలు ఉండవని చెప్పారు. ఆమేరకు చెన్నైలో కూడా ఫ్లెక్సీలపై జీవో ఉందన్నారు. ఆ జీవోని తెప్పించాలని ఇప్పటికే సబ్ కలెక్టర్‌ని ఆదేశించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సెంట్రల్ డివైడర్‌లో.. కూడా ఫ్లెక్సీలు పెట్టకూడదని ఇప్పటికే ఆదేశించడం జరిగిందన్నారు.

# నెల్లూరు కబుర్లు

## నెల్లూరులో మొక్కలు నాటిన గవర్నర్



వెంకటాచలంలో ఈనెల 17న స్వర్ణభారత్ 23వ వార్షికోత్సవానికి వచ్చిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీరా నజీర్‌లు నెల్లూరు ఆర్అండ్‌బి అతిథి గృహ ఆవరణలో మొక్కలు నాటారు. అటవీ శాఖ వారు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొని మొక్కలు నాటారు.

## చెట్లు.. ప్రగతికి మెట్లు



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)లో ఇటీవల జనతా ఫౌండేషన్ మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా సుమారు రెండువందల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. విజయభాస్కరరావు విశ్వవిద్యాలయ పరిపాలన భవనం ప్రాంగణంలో మొక్కలు నాటారు. మానవ మనుగడకు పచ్చదనం ప్రధానమని, చెట్లు.. ప్రగతికి మెట్లు అని ఆయన చెప్పారు. జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు, న్యాయవాది దాసరి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.విజయ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దోమలతో జాగ్రత్త



నెల్లూరు నగరంలో దోమలు వ్యాప్తిచెందకుండా ప్రజలు పరిసరాలు పరిశుభ్రం చేసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని బ్రేక్ ఇన్స్‌పెక్టర్ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. నెల్లూరు బాలాజీనగర్‌లోని నలంద స్కూల్ ఆధ్వర్యంలో ఈనెల 20న 'ప్రపంచ దోమల నివారణ దినోత్సవం' జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు బాలాజీనగర్ నుండి జ్యోతిరావు పూలే బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు, నలంద స్కూల్ డైరెక్టర్ ఫహీం, ప్రిన్సిపాల్ కిరణ్ పాల్గొన్నారు.





## ఉత్తమ సేవలకు విశిష్ట పురస్కారాలు

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నెల్లూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి డా. పొంగూరు నారాయణ చేతుల మీదుగా పురస్కారాలందుకుంటున్న ఉపరవాణ కమిషనర్ బి.చందర్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కే.వీ.సాంబశివారెడ్డి. పక్కన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ జి.కృష్ణకాంత్ తదితరులు.

## జిల్లా పోలీసుశాఖకు..3 వాహనాలు

### అందజేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈనెల 20న జిల్లా పోలీసుశాఖకు 3 బొలెరో వాహనాలను అందజేశారు. దాదాపు 29 లక్షల రూపాయలు విలువచేసే ఆ వాహనాల తాళాలను ఆయన నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం పోలీసులు రేయింబవళ్లు పనిచేస్తుంటారని, వారికి మంచి వాహనాలు అవసరం ఉందని అన్నారు. జిఇఎఫ్ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా ఇచ్చిన ఆ వాహనాలను ఆయన పోలీసులకు బహూకరించారు. పోలీసుశాఖకు వాహనాలు సమకూర్చిన ఆ సంస్థ వారికి, అందుకు సహకరించిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ధన్యవాదాలు తెలిపారు. జిఇఎఫ్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, ఏజీఎం పంపాపతి, అదనపు ఎస్పీలు సిహెచ్.సౌజన్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



నెల్లూరు ఇందిరా భవన్‌లో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి వేడుకలు నెల్లూరులో ఈనెల 20న ఘనంగా జరిగాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి తదితరులు రాజీవ్‌కు ఘన నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ స్ఫూర్తితో రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్‌పార్టీ నేడు దేశంలో కొత్త పుంతలు తొక్కుతోందని చేవూరు దేవకుమార్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేటూరి శ్రీనివాసులరెడ్డి, జిల్లా కిసాన్ సంఘం అధ్యక్షులు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

**రక్తదానం :**

రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఈనెల 20న నెల్లూరులోని కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ విభాగం నాయకుడు అల్లాఉద్దీన్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ కేంద్రంలో 50 మంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం, అనంతరం అనాధాశ్రమాల్లో అన్నదానం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్‌యాదవ్, మైనార్టీ నాయకులు షేక్ హుస్సేన్, రెహమాన్, మల్లికార్జునరెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



## ఆ మానవమృగాలను ఉరితీయాలి

కలకత్తాలో ఈనెల 8వ తేదీన విధి నిర్వహణలో ఉన్న మహిళా వైద్యురాలిని అత్యంత అమానుషంగా అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేసిన మానవ మృగాలను ఉరితీయాలంటూ నెల్లూరులోని బీజేపీ నాయకులు, పార్టీ శ్రేణులు డిమాండ్ చేశాయి. నెల్లూరు మూలపేటలోని పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్లో ఈనెల 20న బిజెపి రాష్ట్ర కార్యదర్శి కె.రాజేశ్వరి మాట్లాడుతూ, మహిళల పట్ల కొందరు మానవ మృగాలు వ్యవహరిస్తున్న తీరు బాధాకరంగా ఉందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని, మహిళలకు రక్షణ కరువైందని, తక్షణమే అక్కడ మమతా బెనర్జీ పాలనను రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించాలని ఆమె కోరారు. నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబోలు రాజేష్, బీజేపీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, అల్లూరు నాగేంద్రసింగ్, కే.సరస్వతి, శ్రావ్య నాగలక్ష్మి, రాయపు పద్మావతి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

### 'ఆర్ట్ గ్లోబ్ కిడ్స్ మాల్'లో..

## క్రీడల విజేతలకు బహుమతులు



నెల్లూరులోని కోటమిట్ట మస్జిద్ వీధిలోని ఆర్ట్ గ్లోబ్ కిడ్స్ మాల్‌లో ఇటీవల క్రీడల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సికిందర్ గ్రూప్ అధినేత అఖిల్, సీనియర్ జర్నలిస్ట్ ఫయాజ్, రబ్బాని, మదీనా గ్రూప్ అధినేతలు షోయబ్, ఉస్మాన్ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాల్ అధినేత రాహిల్ తాజ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచడమే ఈ క్రీడల ఉద్దేశమని తెలిపారు. ఆర్ట్ గ్లోబ్‌లో ఇండోర్ గేమ్స్ ఆటల పోటీలు మూడు రోజుల పాటు జరిగాయి. ప్రథమ బహుమతి రూ. 10వేలు, రెండో బహుమతి రూ. 3వేలు, మూడో బహుమతిగా రూ. 2 వేల చొప్పున అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ఆటగాళ్ల పేర్ల నుంచి లక్కీడిప్‌లను తీసి మదీనా గ్రూపు వారు 15వాచ్‌లను బహుకరించారు. డాక్టర్ కిషోర్ రత్నం స్కూల్స్ గ్రూప్, వైజయంతి గ్రూప్, సికిందర్ టీ గ్రూప్ తదితర సంస్థలవారు సహకారం అందించారు. ఆర్ట్ గ్లోబ్ కిడ్స్ మాల్ నిర్వాహకులు వసీం, ముజమ్మిల్, ఆరిఫ్, అజ్మతుల్లా పాల్గొన్నారు.

## సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు


నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో శ్రావణ శుక్రవారం రోజున అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురాంశర్మ, వేద పారాయణదారుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సోమశిల ప్రాజెక్టుకు.. మంచిరోజులు

## రూ.140 కోట్లతో అభివృద్ధికి సీఎం గ్రీన్‌సిగ్నల్

**ఎట్టకేలకు జిల్లాలో రైతాంగానికి ప్రాణప్రదమైన సోమశిల జలాశయం మరమ్మతు పనులకు మోక్షం కలగనుంది. 5.40 కోట్ల రూపాయల వ్యయంతో సోమశిల ప్రాజెక్టు తక్షణ మరమ్మతు పనులు చేయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడంతో జిల్లా రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.**



జిల్లాలోని సోమశిల ప్రాజెక్టును 140 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేయిస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులో పాడైపోయిన గేట్లను రూ. 5.40కోట్లతో మరమ్మతులు చేయిస్తానని చెప్పారు. ఈనెల 19న మంత్రులు, ఎమ్మెల్యేలతో కలసి ఆయన సీఎం సోమశిల ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం గత వైకాపా ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. 'ఒకప్పుడు దేశానికే అన్నపూర్ణగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉంది. అలాంటి రాష్ట్రం గత ప్రభుత్వ తప్పుడు విధానాలు, నిర్లక్ష్య ధోరణి కారణంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొందని దుయ్యబట్టారు. వైకాపా హయాంలో సాగునీటి ప్రాజెక్టులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని, కనీసం వాటి నిర్వహణకు అవసరమైన నిధులు కూడా ఇవ్వలేదని విమర్శించారు. సర్వేరాళ్లపై బొమ్మలకు, రిషికొండ ప్యాలెస్‌కు కోట్లు ఖర్చు పెట్టిన గత ప్రభుత్వం... కీలకమైన సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల మరమ్మతులకు రూ. 300 కోట్లు ఖర్చు అవుతుందని, ఒక్క సోమశిలకే సుమారు రూ. 140 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారని ఆయన పేర్కొన్నారు. అయినా రాష్ట్రంలో కరవు అనేది ఉండకూడదని, రైతులకు సాగు ఖర్చులు తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుతామని చెప్పారు. 'దెబ్బతిన్న సోమశిల గేట్లు రిపేరు చేయించి, ఆప్రాన్ నిర్మిస్తామని, స్లూయిస్‌లో కూడా గోడ నిర్మిస్తామని, గేట్లు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. రైతుల సమస్యలు అర్థం చేసుకునే పార్టీ టీడీపీయేనన్నారు. కండలేరులో కూడా 68 టీఎంసీలు నిల్వచేసుకొని 3 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే అవకాశం ఉందని, ఈ రెండు ప్రాజెక్టుల్లో నీళ్లుంటే నెల్లూరు, కొంత తిరుపతి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు నీళ్లివ్వచ్చున్నారు. ఈ యేడాది ఎగువ ప్రాంతాల్లోనూ, మన రాష్ట్రంలో కూడా బాగా వర్షాలు కురిశాయి. కృష్ణా నదిపై ఉన్న జలాశయాలన్నీ నీటితో కళకళ లాడుతున్నాయి. పెన్నాకు కూడా వరద పెరిగితే కండలేరు, సోమశిల కూడా నిండుతాయని అన్నారు. 20ఏళ్ల తర్వాత ఇప్పుడు మొదటిసారిగా ఏపీలో ఆగస్టు నెలలో రిజర్వాయర్లన్నీ కళకళలాడుతున్నాయని, వరుణ దేవుడు మనల్ని ఆశీర్వదిస్తున్నాడని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

### తప్పు చేసిన వారు.. ఎక్కడ దాక్కున్నా వదలం

మా ప్రభుత్వంలో రాజకీయ కక్షలు ఉండవు... కానీ తప్పులు చేసిన వారు ఎక్కడ దాక్కున్నా వదలం.. అని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 'తాను సీఎంగా బాధ్యతలు చేపట్టగానే 5 హామీల అమలుపై సంతకాలు పెట్టాను. చదువుకున్న యువతకు ఉద్యోగాలివ్వాలనే ఉద్దేశ్యంతో మెగా డీఎస్సీలో భాగంగా 16,347 ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నాం. రెండో సంతకం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై చేశామని సీఎం చెప్పారు. 'మీ భూములకు కూడా టెండర్ పెట్టడానికి గత పాలకులు ఈ చట్టాన్ని తెచ్చారు. మదనపల్లిలో ఫైళ్లు తగలబెట్టారు. షార్ట్ షర్క్యూట్ అని ప్రచారం చేశారు. ఇది షార్ట్ సర్క్యూటా... లేక వివేకానందరెడ్డి సంఘటనలో వలే గొడ్డలిపోటా అన్న అనుమానం వచ్చింది. కరడుగట్టిన నేరస్తులు రాజకీయ ముసుగులో తప్పులు చేసి మాట్లాడుతున్నారు. గుడ్డ కాల్చి ముఖాన వేసి తుడుచుకోమని చెప్తున్నారు. వివేకాను చంపి నారాసుర రక్త చరిత్ర అని మళ్లీ నాపైనే కథనాలు రాశారు. అందుకే మదనపల్లిలో ఫైల్స్ దగ్ధంపై డీజీపీ, ఇంటెలిజెన్స్ అధికారులను పంపి అక్కడికి విచారణకు ఆదేశించాను' అని ఆయన అన్నారు. అసైన్డ్ భూములను 22ఏ నుండి ఫ్రీహోల్డ్ చేసి భూములు దోచేశారని, ఇళ్లలో కూర్చుని వాళ్లకు నచ్చినట్లు ఫైళ్లు రాశారని, నిన్న పోలవరం ఫైల్స్, అంతకముందు పొల్యూషన్ బోర్డు ఫైల్స్ కాల్చేశారని అంటూ, ఫైల్స్ తగలబెట్టి మళ్లీ ఏమీ తెలియనట్లుగా ఎదురు మాట్లాడుతున్నారని అన్నారు.



## గురువుల ఋణం.. తీర్చుకోలేనిది

### - పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

కుటుంబ విలువలు, గురువుల పట్ల అపారమైన గౌరవం వంటివే భారతదేశాన్ని ప్రపంచానికి ఆదర్శంగా నిలిపాయని, గురువుల ఋణం ఏనాటికీ తీర్చుకోలేనిదని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నెల్లూరులోని టౌన్‌హాల్‌లో తనకు పాఠాలు బోధించిన తెలుగు మాస్టారు పోలూరి హనుమజ్జానకీ రామశర్మ శతజయంతి ఉత్సవాల సభలో ఆయన మాట్లాడారు. నెల్లూరుకు చెందిన సాహితీ మణిదీపాల్లో పోలూరి హనుమజ్జానకీ రామశర్మ ఒకరని ఆయన కీర్తించారు. పోలూరు వారు సాక్షాత్తూ బ్రాహ్మీమయమూర్తి అని, విష్ణుపదార్చన చేసి, సాహిత్యంతో పరమేశ్వరుణ్ని అభిషేకించారని తెలిపారు. తాను డిగ్రీ చదివే రోజుల్లో తెలుగు భాష, సాహిత్యాలపట్ల మక్కువ పెరగడానికి తమ గురువు పోలూరువారే కారణమన్నారు. శ్రీ పోలూరి హనుమజ్జానకీ రామశర్మ శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న వారి శిష్యబృందానికి, కమిటీ సభ్యులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్ ద్వారా వెంకయ్యనాయుడు ఏర్పాటు చేసిన శ్రీ పోలూరి హనుమజ్జానకీ రామశర్మ స్మారక పురస్కారాన్ని నెల్లూరు పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్‌కు బహూకరించారు. ఈ పురస్కారం ఏర్పాటు చేయడం ద్వారా గురువు రుణం తీర్చుకున్నానని చాలామంది అన్నారని, అయితే తల్లిదండ్రులు, గురువుల రుణం తీర్చు కోవటం సాధ్యం కాదన్నది తమ వ్యక్తిగత అభిప్రాయమని వెంకయ్యనాయుడు తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆకాశవాణి పూర్వ డైరెక్టర్ జనరల్ రేవూరి అనంత పద్మనాభరావు, తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి జె.చెన్నయ్య, పోలూరు హనుమజ్జానకీరామశర్మ శిష్యులు పాల్గొన్నారు.



## చంద్రన్నకి రాఖీ కట్టిన ప్రశాంతిరెడ్డి

రాఖీ పౌర్ణమి సందర్భంగా ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రాఖీ కట్టారు. అన్నా చెల్లెళ్ళ ఆత్మీయ బంధానికి ప్రతీకగా నిలిచిన ఈ పండుగరోజున, సోమశిల జలాశయాన్ని సందర్శించేందుకు నెల్లూరు జిల్లాకు వచ్చిన చంద్రబాబుకు ఆమె రాఖీ కట్టి, రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



## మా సమస్యలు తీర్చండి..

### - నారా లోకేష్‌కి మాగుంట శీనయ్య వినతి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఇటీవల ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కలిశారు. ప్రకాశంజిల్లాలోని పలు సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు, ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీకి ప్రత్యేక నిధుల కేటాయింపు గురించి శీనయ్య లోకేష్‌తో చర్చించారు.

## కోవూరు అభివృద్ధికి నిధులివ్వండి

### సీఎంకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విన్నపం




కోవూరు నియోజకవర్గం అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 19న సీఎం సోమశిల జలాశయం సందర్శనకు వచ్చినప్పుడు ఆమె సీఎంను కలసి కోవూరు నియోజకవర్గ సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించారు. కోవూరు నియోజకవర్గం పరిధిలో గత కొన్నేళ్ళుగా సాగునీటి కాలువలు మరమ్మతులకు నోచుకోలేదని, పల్లిపాడు వద్ద పెన్నానదికి రిటైనింగ్ వాల్స్ నిర్మించి కరకట్టలు పటిష్టం చేయండని, అదేవిధంగా ముదివర్తి–ముదివర్తి పాళెం కాజ్ వే నిర్మాణానికి నిధులివ్వాలని ఆమె కోరారు. మలిదేవి కెనాల్, సదరన్ చానల్, పైడేరు ఎస్కేప్ చానల్ తదితర సాగునీటి కాలువల దుస్థితిని ఆమె సీఎంకు వివరించారు. పెన్నానదికి ఇరువైపులా ఇటు పోతిరెడ్డిపాలెం నుంచి అటు ముదివర్తి వరకు, పల్లిపాడు గాంధీ ఆశ్రమం వద్ద రిటైనింగ్ వాల్స్ నిర్మించి కరకట్టలు పటిష్టం చేసి కోవూరునియోజకవర్గాన్ని వరద ముప్పు నుంచి కాపాడాలని కోరారు. పెన్నానదిపై ముదివర్తి–ముదివర్తి పాళెం మధ్య నత్తనడకన సాగుతున్న సబ్‌మెర్సిబుల్ కాజ్ వే నిర్మాణానికి నిధులు అందచేసి వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆమె సీఎంకు విన్నవించారు.




# కళ్యాణ వైభోగం...!







## కళ్యాణ్ - యశస్విని

నెల్లూరు మాజీ శాసనసభ్యులు జే.కే.రెడ్డి తమ్ముడు జక్కా సోదరులలో చివరివాడైన జక్కా శివనారాయణరెడ్డి - లక్ష్మీప్రసన్నల కుమారుడు **కళ్యాణ్ రంగారెడ్డి - యశస్వినిల** పెళ్లి ఆగస్టు 15వ తేదీ హైదరాబాదులోను, రిసెప్షన్ ఆగస్టు 20న నెల్లూరులోనూ జరిగాయి. ఈ రెండు వేడుకల్లో జక్కా కుటుంబ ఆప్తులు, బంధుమిత్రులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, అనేక రంగాల ప్రముఖులు పాల్గొని కొత్త జంటను దీవించారు.

కళ్యాణ్ - యశస్వినిలకు 'లాయర్' శుభాశీస్సులు.

# దివ్యాంగులకు కృత్రిమ పరికరాల అమరిక.. ఓ ఉదాత్తమైన కార్యక్రమం

## - వెంకయ్యనాయుడు



ఆపన్నులకు, అందులోనూ దివ్యాంగులకు కృత్రిమ పరికరాలను అందించటం ఓ ఉదాత్తమైన కార్యక్రమమని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చెప్పారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయసమితి, హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ట్రస్ట్ నిర్వహిస్తున్న జైపూర్ ఫుట్ కృత్రిమ అవయవాల అమరిక శిబిరాన్ని ఆయన ఇటీవల రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం వీల్ చైర్లు, వాకర్లు, క్రచెస్‌ను లబ్ధిదారులకు అందజేశారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపా వెంకట్, ట్రస్టీ అట్లూరి అశోక్, భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయసమితి కార్యదర్శి ఇంద్రకుమార్ జైన్, ప్రదీప్ జైన్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మానవ సేవే మాధవ సేవ అని పెద్దలు చెప్పారని, సంపదతో పాటు మన నైపుణ్యంలో కొంత భాగాన్ని సమాజం కోసం కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు.

### దీపమ్మకు ఆనం అభినందనలు

తనకు చిన్నతనం నుంచి దీపమ్మ తెలుసని, ఇంత మంచి కార్యక్రమాలతో స్వర్ణభారత్ ట్రస్ట్‌ని ఆదర్శంగా నిలుపుతున్న ఆమెకు ప్రత్యేక అభినందనలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఇలాంటి అరుదైన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవటంతో పాటు, తమకు తెలిసిన వారికి కూడా సమాచారం ఇచ్చి, అందరూ వినియోగించుకునేలా చూడాలని పేర్కొన్నారు. చక్కని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్, భగవాన్ మహావీర్ వికలాంగ సహాయ సమితి నిర్వహణ బృందానికి అభినందనలు తెలియజేశారు.

## ఫ్లెక్సీలు కట్టకండి..
# పేదలకు అన్నం పెట్టండి

**కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



తన కార్యక్రమాల సందర్భంగా ఎవరూ ఫ్లెక్సీలు కట్టవద్దని, వాటికి బదులుగా అన్న క్యాంటీన్‌లకు విరాళమిస్తే, ఆ డబ్బుతో పదిమందికీ అన్నం పెట్టినట్లవుతుందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన రూరల్ నియోజకవర్గం పరిధిలోని 17వ డివిజన్ హరనాథపురం సెంటర్‌లో, నగర సుందరీకరణలో భాగంగా సూర్యనమస్కారాల విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫ్లెక్సీలు కట్టడం, బొకేలు, శాలువాలకు ఖర్చు చేసే బదులుగా, ఆ మొత్తాలను అన్న క్యాంటీన్‌లకు విరాళంగా ఇవ్వడం మంచిదన్నారు. తన కార్యక్రమాల్లో రాజకీయ ఫ్లెక్సీలు లేకుండా చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### నేనెప్పుడూ ప్రజల పక్షాన్నే ఉంటా...

తానెప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తానని..నాయకులు, కార్యకర్తల వైపే ఉంటానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్, కల్లూరుపల్లిలో దాదాపు 4 కోట్ల రూపాయల నిధులతో ఏర్పాటుచేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులు, ప్రజలతో మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గం ప్రజలు తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి అభివృద్ధే తన ధ్యేయమని అన్నారు. రూరల్ ప్రజలు తనను గుండెల్లో పెట్టుకుని తనకు విజయం సాధించిపెట్టారని, వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



## గూడూరును..
# నెల్లూరు జిల్లాలో కలపండి

**సీఎంకి విన్నవించిన ఎమ్మెల్యే పాశిం**

శ్రీసిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు విచ్చేసిన నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని సీఎంకి ఎమ్మెల్యే సునీల్ విన్నవించారు.

## రూరల్ సీఐగా కిషోర్‌బాబు



గూడూరు రూరల్ సీఐగా కిషోర్‌బాబు ఈ నెల 19న గూడూరు పట్టణంలోని రూరల్ సీఐ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా కిషోర్‌బాబు సి.ఐ.డి హెడ్ క్వార్టర్స్ నుండి గూడూరు రూరల్ సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.



## వృద్ధుల ఆశ్రమానికి దుప్పట్ల పంపిణీ

గూడూరులోని గమళ్ళపాలెంలో వున్న వృద్ధుల ఆశ్రమంలో ఈ నెల 21వ తేదీ రోటరీ క్లబ్ గూడూరు ఆధ్వర్యంలో రొటేరియన్ సొల్లేటి ప్రసాద్ కుమారుడు సాయిచరణ్ మొదటి వివాహ వార్షికోత్సవం సందర్భంగా, వృద్ధులకు చలికాలాన్ని దృష్టిలో వుంచుకొని దుప్పట్లు పంపిణీ చేసి అనంతరం భోజన వితరణ చేశారు. రోటరీ అధ్యక్షులు బి.శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి జీ.జీ.నాయుడు, పి.వి.కృష్ణయ్య, కిరణ్‌చక్రవర్తి, మయూరి శ్యాంయాదవ్, తానంకి రమణయ్య, రవీంద్రరెడ్డి, పి.మోహన్‌రెడ్డి, వి.సుధాకర్, జగదీష్ నాయుడు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భారత్ బంద్ సందర్భంగా ఈ నెల 21న గూడూరులోని డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న గూడూరు మాలమహానాడు నాయకులు చింతల చిరంజీవి, గోను శివకుమార్, అరవ పార్వతయ్య, కే.ఆర్.దాసరి, ఎస్.బాబయ్య, బీఎస్పీ నాయకులు నాసిన భాస్కర్‌గౌడ్, హరి, చింతల బాబు తదితరులు.

# సమాజానికి చికిత్స అవసరం

కోల్‌కతాలో ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిని అత్యంత దారుణంగా అత్యాచారం చేసి హతమార్చిన సంఘటన యావద్దేశాన్ని కలచివేసింది. ఈ సంఘటన మరచిపోకముందే మరో దారుణం కూడా వెలుగు చూసింది. మహారాష్ట్రలోని బదలాపూర్‌లో ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్ ఒకడు అభం శుభం తెలియని చిన్నారులపై బాత్రూంలో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి ఉరి వేయాలంటూ వేలాది మంది ప్రజలు రైల్వే ట్రాక్‌లపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇటువంటి అమానవీయ సంఘటనలు పునరావృతం కాకుండా సమాజాన్ని సంస్కరించుకోవాల్సిన అవసరం, వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రోగం వచ్చిన తర్వాత చికిత్స చేయడం ఎంత ముఖ్యమో, రోగం రాకుండా నివారణ చర్యలు చేపట్టడం కూడా అంతే ముఖ్యమని వైద్యశాస్త్రం చెబుతోంది. కొన్ని సందర్భాల్లో కొన్ని రోగాలకు చికిత్స ఉండదు కూడా. అంటే.. నివారణే అత్యంత ముఖ్యం. ఇది సమాజానికి కూడా వర్తిస్తుంది.

ఆదిమకాలం నాటి సమాజం నుంచి చాలా దూరం ప్రయాణించి వచ్చిన సమాజం మనది. లైంగిక విషయాల పట్ల కూడా మనకు అనేక నియమాలున్నాయి. ఎప్పటికప్పుడు సమాజాన్ని సంస్కరించుకుంటూ ప్రతి విషయంలోనూ ఒక నిర్దిష్ట పద్ధతి ఏర్పర్చుకున్నాం. ఆ సంస్కరణల్లోంచి పుట్టినవే కుటుంబం, వివాహవ్యవస్థ, ఆచారాలు, సంప్రదాయాలు. ఏ ఒక్క వ్యక్తో, ఏ ఒక్క రోజో కూర్చొని పంచాయతీ పెట్టి సమాజం ఇలా ఉండాలి అని నిర్దేశిస్తే ఈనాటి సమాజం తయారుకాలేదు. నేటి సమాజం ఇలా రూపుదిద్దుకోవడం వెనుక వేల సంవత్సరాల పాటు ఎంతోమంది సామాజికవేత్తలు, రుషులు, మహర్షుల మేధోమథనం ఉంది. సంఘర్షణ ఉంది. కాలానుగుణంగా లోపాలు, లోటుపాట్లను సంస్కరించుకుంటేనే మరింత మంచి సమాజం ఏర్పడుతుంది.

వలసపాలనలు, ఆ తర్వాత ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలతో మన సమాజం చాలా మార్పు చెందింది. ఆ మార్పు మంచికా, చెడుకా అన్న విశ్లేషణ పక్కనబెడితే, ఆ మార్పులకు అనుగుణంగా మన సమాజంలో సంస్కరణలు వచ్చాయా అన్నదే పెద్ద ప్రశ్న. 'నిర్భయ' సంఘటన కావచ్చు, తాజాగా కోల్‌కతా సంఘటన కావచ్చు..సమాజంలో మరిన్ని సంస్కరణలు రావాల్సిన అవసరం కనబడుతోంది. ఆర్థిక సంస్కరణలకన్నా ముఖ్యంగా సామాజిక సంస్కరణల అవసరం చాలా ఉంది. ఈ సంస్కరణలు మన కుటుంబం నుంచి, మనం చదువుకునే బడి నుంచి మొదలు కావాలి. ప్రభుత్వాలు కూడా ఈ విషయంపై దృష్టి పెట్టాలి. ఎలా మనల్ని మనం సంస్కరించుకోవాలో, సమాజాన్ని ఎలా సంస్కరించాలో అవగాహనకు రావడానికి సామాజికవేత్తలతో చర్చించాలి.

కోల్‌కతా సంఘటనపై మీడియా కథనాలను పరిశీలిస్తే.. వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరిగిందన్న అనుమానాలు వస్తున్నాయి. అలాగే ఆ ఆస్పత్రి ఎన్నో అక్రమాల పుట్ట అని, వాటి బాగోతం బయటపడకుండా ఉండేందుకే వైద్యురాలిపై అంతటి దారుణానికి ఒడిగట్టారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత ఆత్మహత్యగా చిత్రీకరించడం, సీబీఐకి కేసు బదిలీ అయ్యాక ఆస్పత్రిలో విధ్వంసం సృష్టించడం తదితర పరిణామాలను గమనిస్తే ఆధారాలు లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారా.. అన్న అనుమానాలు వస్తున్నాయి. సీబీఐ దర్యాప్తు పూర్తయితే కానీ వివరాలు బయటకు రావు. ఒక వేళ కొంతమంది అనుమానిస్తున్నట్లు అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తేలితే, ఇంకెన్నో ఘోరాలు కూడా బయటపడే అవకాశం ఉంది. ఆ వైద్యురాలి స్థానంలో మగవాడు ఉన్నా ప్రాణాలు పోయే పరిస్థితే ఉండేది. ఇలాంటి అకృత్యాలు వెలుగు చూసినప్పుడు ఆడ, మగ అనే తేడా లేకుండా స్పందించగలిగేలా సమాజంలో సహేతుకమైన సంస్కరణలు రావాలి. ప్రతి సంఘటనకు రాజకీయ రంగు పులమడం మానుకోవాలి. కోల్‌కతా, ఠాణె సంఘటనలకు ఇప్పటికే రాజకీయ రంగు అంటుకుంది. ఆయా రాష్ట్రాల్లో, అధికార, ప్రతిపక్షాలు పరస్పరం నిందారోపణలు చేసుకుంటున్నాయి. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కోల్‌కతా సంఘటనను భాజపా రాజకీయంగా ఉపయోగించుకుంటోందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఆరోపించారు. 'మమత రాజీనామా చేయాలని ట్రెండింగ్ చేస్తూ భాజపా ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేస్తోంది. అసలు నిరసనకారుల స్థానంలో బీజైవైఎం, భాజపా కార్యకర్తలు వచ్చి చేరారు. దర్యాప్తు బాధ్యతను కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ తీసుకుని ఐదు రోజులు (ఈనెల 19 నాటికి) గడిచిపోయింది. కేసులో ఏమాత్రం పురోగతి లేదు. అయినా సీబీఐకి వ్యతిరేకంగా నిరసన మాత్రం చేయరు." అని ఆయన విమర్శించారు. కోల్‌కతా సంఘటనపై జరుగుతున్న నిరసన కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పాల్గొని, నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేయడాన్ని 'నిర్భయ' తల్లి ఆశాదేవి తప్పుబట్టారు. "ఆరోగ్యమంత్రిత్వశాఖ, పోలీసు విభాగం ఆమె ఆధీనంలోనే ఉన్నాయి. ఆమె ఎవరికి వ్యతిరేకంగా నిరసన తెలియజేసినట్లు? ఎవరు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేస్తున్నారు? నిర్భయ సంఘటన నుంచి మనం ఏమి నేర్చుకున్నట్లు? వ్యవస్థలో ఏం మార్పులు చేసుకున్నాం? 2012 నుంచి ఏమీ మార్పు రాలేదు".. అని వ్యాఖ్యానించారు.

ఠాణె జిల్లాలోని బదలాపూర్ సంఘటపైనా రాజకీయాలు ముసురుకున్నాయి. "బదలాపూర్ సంఘటనను ఎన్సీపీ నాయకురాలు సుప్రియాసూలె, పూర్వ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రె రాజకీయం చేస్తున్నారు. బదలాపూర్‌లో నిరసన చేపడుతున్న వారు బదలాపూర్ వాసులు కాదు. పొరుగు ప్రాంతాల నుంచి తీసుకొచ్చారు".. అని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవంద్ర ఫడనవిస్ ఆరోపించారు. ఆయన చెప్పినట్లు పొరుగు ప్రాంతాల నుంచే వచ్చారనుకున్నా ఏ ప్రాంతంలో సంఘటన జరిగితే ఆ ప్రాంత వాసులకు మాత్రమే నిరసన వ్యక్తంచేసే హక్కు ఉంటుందా? పొరుగు ప్రజలు బాసటగా నిలవకూడదా?..వంటి ప్రశ్నలకు సమాధానాలు లేవు. శిక్ష అన్నది నిస్సందేహంగా నేరాన్ని నివారించడానికి ఉపయోగపడుతుంది. అయితే అది సర్వరోగ నివారిణి కాదు. శిక్ష కన్నా అంత:కరణ శుద్ధి ముఖ్యం. అందుకే ఆర్థిక సంస్కరణలు ఎంత ముఖ్యమో సమాజ సంస్కరణ కూడా అంతే ముఖ్యం. ప్రస్తుత సమాజం రాజకీయ వ్యవస్థ నడుపుతున్న సమాజం కాబట్టి..రాజకీయ నాయకులు సమాజ సంస్కరణలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి. అప్పుడే వ్యవస్థను సక్రమంగా.. ప్రశాంతంగా నడపడం సాధ్యమవుతుంది.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**



జానకిరామ.. (27)

# రామాయణం

- ఊటుకూరు జానకి రామారావు

కావున ఓ సుకుమారీ! ఎండ కన్నెరుగనిదానవు నీవు, ఏడుమల్లెలెత్తుగా పెరిగినదానవు. ఇన్ని కష్టాలు భరించలేవు.

వనవాసం దుఃఖంతో కూడినటువంటుది, నీవు రావలదు అని స్పష్టంగా చెప్పేశాడు రాముడు!.

అప్పుడు కన్నుల నీరు నింపుకొని ప్రేమగా భర్తను చూస్తూ, రామా నిజమే! వనవాసంలో ఇన్ని దోషాలు ఉన్నమాట నిజమే! కానీ నీ సాంగత్యంలో అవన్నీ నాకు గుణాలే!

క్రూరమృగాలు నిన్నుచూస్తేనే పారిపోతాయి!

నీతో ఒక్కక్షణ వియోగమైనా నాకు మరణహేతువు! రామా నీవు నా ప్రక్కన ఉంటే ఈ ప్రపంచంలో ఏదీ నాకు అవసరం లేదు!

ఇంతగా ప్రాధేయపడినా రాముని మనసు కరుగలేదు! ఇక లాభం లేదనుకుంది సీతమ్మ!

ప్రేమచేత ప్రార్థిస్తే వినటంలేదీయన అని అనుకొంది.

ఎర్రబడ్డకళ్ళతో కించిదహంకారంతో నిందించడం మొదలుపెట్టింది.

రామా! నీవు పురుష శరీరంలో ఉన్న ఒక ఆడుదానివి! అసలు నిన్ను ఆ మిథిలాధీశుడు ఏం చూసి అల్లుడుగా చేసుకొన్నాడో అర్థం కావటంలేదు నాకు!

నువ్వుతప్ప నాకిక్కడ ఎవ్వరూ గతిలేరు, నీవులేక నేను ఒంటరి దానను, నన్నిక్కడే వదిలివెళ్ళాలని ఎందుకనుకుంటున్నావు! నీ భయానికి గల కారణమేమిటి?

సావిత్రి సత్యవంతుడిని అనుసరించినట్లు నీ నీడలా నిన్ను అనుసరిస్తూనే ఉంటాను!

రామా! కులానికి కళంకం తెచ్చే సామాన్య స్త్రీని కాను నేను!

నీవు తప్ప మరొకరిని మనస్సుచేత కూడా చూడను!

**స్వయంతు భార్యాం కౌమారీమ్...**

నేను నీ భార్యను, యవ్వనంలో ఉన్నదానిని, భార్యను ఇతరులకు అప్పగించి జీవించువాడివలే నన్నిక్కడ వదిలేసి వెళతావా?

నీవు ఎవరి హితం గురించి మాటలాడుతున్నావో నీవే వారికి విధేయుడిగా ఉండు! నేనెందుకుండాలి? నేనెవరికీ ఇచట విధేయురాలిగా ఉండవలసిన అవసరంలేదు. అసలు అవి అయుక్తమైన మాటలు!

నీవుండేచోటు నాకు స్వర్గం, నీ సాన్నిధ్యం లేకపోతే నాకేదీ రుచింపదు.

మార్గంలో ముళ్ళు ఉంటాయంటావా! అవన్నీ నాకు దూదితో సమానం,పెనుగాలులు రేగి దుమ్ము కప్పి వేస్తుందంటావా నీ ప్రక్కన ఉంటే అదే నాకు మంచిగంధమవుతుంది రామా!.

వనాలలో పచ్చికబయళ్ళమీద పడుకుంటే చిత్రమైన కంబళ్ళు కప్పిన పడకలకంటే సుఖం రామా! నీ ప్రక్కన ఉంటే ప్రపంచంలో ఏదైనా నాకు అత్యంత సుఖకరమైనవే! నన్ను నీవు ఇక్కడనే శత్రువుల పరంచేసి వెళతానంటే మాత్రం ఈ క్షణమే, ఇప్పుడే విషం తాగి చావనైనా చస్తాను కానీ వైరులవశం మాత్రంకాను...

నీవు అంతకాలం కనపడకపోతే దుఃఖంతో ఎప్పుడో ఒకప్పుడు చావవలసినదానినే! ఆ చావు ఇప్పుడే నన్ను వరించనీ!

అని ఏడుస్తూ తనను కౌగలించుకొన్న సీత చుబుకము ఎత్తిపట్టి మెల్లగా ప్రేమగా అనునయిస్తూ నీవులేకుండా నేను మాత్రం ఒక్కక్షణమైనా ఉండగలనా? నీ అభిప్రాయం తెలుసుకోకుండా నేను నిన్ను అడవికి ఎలా తీసుకెళతాను?

ఆత్మాభిమానం కలవాడు తన కీర్తిని ఎలా విడువజాలడో ఆవిధంగా నేను నిన్ను విడువజాల!.

సీతా! పితృవాక్పాలనం నా ధర్మం!

సీతా, తల్లికి, తండ్రికి లొంగి ఉండటమే ధర్మం.

అలాంటి ధర్మాన్ని విడిచి నేను జీవించను.

కనపడే దేవతలు తల్లీ, తండ్రీ, గురువులు! అలాంటి వారిని విడిచి మనకు అందుబాటులో లేని దైవాన్ని ఆరాధించటమెందుకు?

**అస్వాధీనమ్ కథం దైవమ్ ప్రకారైరభిరాధ్యతే**
**స్వాధీనమ్ సమతిక్రమ్య మాతరం పితరం గురుమ్!.**

తల్లి, తండ్రి, గురువులు ముగ్గురూ మూడులోకాలు. వీరితో సమానమైన వారు ఈ భూలోకంలో లేరు! అందుకే వారి సేవ చేయవలెను!

తండ్రి సేవను మించిన బలకరమైంది ఏదీ లేదు! తండ్రి ఆజ్ఞ పాటించుటవలన మనిషికి సకలైశ్వర్యములు సమకూరగలవు!

నా తండ్రి ఆజ్ఞ పాటించాలని, ఆయన ఇష్టానికి అనుగుణంగా నడుచుకోవాలనీ నేను కోరుకుంటున్నాను! ఇదే సనాతన ధర్మం!

సీతా నీవు నాకు సహధర్మచారిణివి! నీవు నాకూ, నీకూ మేలుకూర్చే మంచి నిర్ణయం తీసుకొన్నావు !

వెంటనే బయలుదేరదాం! నీ వద్ద ఉన్న విలువైన వస్తువులన్నీ దానం చేసెయ్!..

ఇంతకుమునుపే రామాంతఃపురానికి వచ్చిన లక్ష్మణుడు అన్నావదినల సంభాషణ అంతా విన్నాడు.

గుండెలు చెలమలయ్యాయి!

కన్నులు కన్నీటి జలపాతాలయాయి!

హృదయాన్ని వారి సంభాషణ కలచివేసింది!

దుఃఖం ఎలా ఆపుకోవాలో అర్థం కాలా లక్ష్మణునకు.



ఉన్నపళంగా అన్న పాదాలమీద వ్రాలాడు.

అన్నా, నీ ముందు నేను నడుస్తాను! నీ మార్గాలు నిష్కంటకం చేస్తాను! నీవులేని అయోధ్యలో నేనూ ఉండను.

అన్నా నీతో కలిసి ఉండటమా! దేవలోక ఆధిపత్యమా?

ఈ రెండింటిలో! ఏది? అంటే.. నీతో కలిసి ఉండి నీ సేవ చేసుకోవటం నాకు ముఖ్యం. అదే అన్నింటికన్నా ఎక్కువ నాకు.

తనతో కలిసి అడవికి వస్తానన్న తమ్ముని పరిపరివిధాలుగా వారించాడు రామచంద్రుడు!

లక్ష్మణస్వామి పట్టిన పట్టు విడువడే!

అదేమిటన్నా నీవు ఇంతకు పూర్వమే నాకు అనుమతి ఇచ్చావుగా అన్నా! ఇప్పుడిలా అంటున్నావేమిటి?

(ఎప్పుడు అనుమతిచ్చాడు రాముడు? సీతాదేవితో సంభాషణ అంతా విన్నాడు లక్ష్మణుడు అప్పుడు ఆయన భరతశత్రుఘ్నులతో బాగుండమని కదా చెప్పినది! లక్ష్మణుడి ప్రసక్తితేలేదక్కడ! అంటే లక్ష్మణుడు ఎక్కడుంటాడు! సదా రాముడితోటే! చిన్నతనం నుండే అలవాటు అన్నతోటే ఉండటం! అన్నకూ అదే ఊహ తమ్ముడు తననుండి వేరుకాదని! కానీ ఈ సంకట సమయంలో కూడా రాముడు తమ్ముని తనతోటే అనుకుంటూ అలవాటు ప్రకారం మాట్లాడాడు! అది పట్టుకున్నాడు లక్ష్మణుడు ఇప్పుడు).

లక్ష్మణా! నీవు కూడా నాతో వస్తే అమ్మ కౌసల్యను, తల్లి సుమిత్రను చూసుకొనేదెవరు? వారి పోషణ భారం ఎవరు భరిస్తారు?

కామవశుడైన తండ్రి ఇప్పుడు వారిని మునుపటిలా చూడగలడా? రాజ్యం హస్తగతమైన వెంటనే సవతులను ముప్పుతిప్పలు పెడుతుంది కైక! లక్ష్మణా నీవిచటనే యుండి తల్లుల యోగక్షేమాలు చూసుకోవాలి! అదే నేను కోరుకునేది.

అన్న రాముని చూసి లక్ష్మణుడు, అన్నా! అమ్మ కౌసల్యను ఒకరు చూడాలా! ఆవిడ అధీనంలో వెయ్యి గ్రామాలున్నాయి, మనలాంటి వారిని పదిమందిని పోషించగలదావిడ!

.. (సశేషం)

# కళ్యాణ వైభవం...!

## డాక్టర్ కౌశిక్ - శ్రీపవిత్ర



నెల్లూరులోని సింహపురి హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి - శ్రీమతి ప్రసూనల కుమారుడు డాక్టర్ కౌశిక్‌రెడ్డి - శ్రీపవిత్ర (శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి - శ్రీవాణిల కుమార్తె)ల వివాహం ఆగస్టు 18వ తేదీ బెంగుళూరులో జరిగింది. ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతిలు ఈ వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను దీవించారు. ఆగస్టు 21న నెల్లూరులో జరిగిన రిసెప్షన్ వేడుకలో మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులతో పాటు అనేకమంది రాజకీయ, రాజకీయేతర, అధికార, అనధికార ప్రముఖులు, రెండు కుటుంబాల బంధుమిత్రులు పాల్గొని కొత్త జంటకు తమ ఆశీస్సులు అందించారు. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.




ప్రపంచ తమిళ చాంబర్ ఆఫ్ కామర్స్ (డబ్ల్యూటీసీసీ) వైద్యరంగంలో నిష్ణాతులను ఎంపిక చేసి ప్రతి ఏటా ఇచ్చే అవార్డుల కార్యక్రమం ఇటీవల చెన్నైలో జరిగింది. ఈ 8వ వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్యప్రముఖులకు అవార్డులు అందజేశారు. తమిళనాడు మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రొ. సీ.ఎం.కే.రెడ్డి ఈ అవార్డుల ఎంపిక జ్యూరీ సభ్యుడిగా వ్యవహరించారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రొ. సీ.ఎం.కే.రెడ్డితో పాటు 'విట్' సంస్థల వైస్‌ప్రెసిడెంట్ జీ.వీ.సెల్వం తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి ప్రమాదం!

(మొదటిపేజీ తరువాయి)

ఇదే క్రమంలో మహారాష్ట్రకి చెందిన ఓట్ ఫర్ డెమోక్రసీ అన్న సంస్థ మొన్నటి ఎన్నికలలో ఆంధ్రా, ఒరిస్సా రాష్ట్రాలలో పోలైన ఓట్లకన్నా ఎక్కువ శాతం లెక్కింపు జరిగిందని సంచలనాత్మక ఆరోపణ చేసింది. ఆంధ్రాలో 12.54, ఒరిస్సాలో 12.04శాతం ఓట్లు ఎక్కువ లెక్కించబడ్డాయన్నది ఆ సంస్థ ఆరోపణ. ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాలలో ఒకేసారి ఎన్నికలు జరగడం ఇక్కడ గమనార్హం. అయితే, పోలింగు సమయంలోనే ఈ తేడా జరిగిందా..? లేక పోలింగుకి, కౌంటింగుకి మధ్యలో ఏమైనా జరిగిందా అన్న విషయంలో సదరు సంస్థ స్పష్టత ఇవ్వలేదు. ఆరోపణ మాత్రమే చేసి మీరు మీరు కొట్టుకోండి అన్నట్లుగా సరిపెట్టుకుంది. ఈ అంశంలో ఇప్పుడు దేశవ్యాప్త చర్చ జరుగుతోంది. ఉండవల్లి అరుణ్‌కుమార్ లాంటి రాజకీయ విమర్శకులు ఈ అంశంలో స్పష్టత కావాలని డిమాండ్ చేస్తున్నారు. అలా జరిగే అవకాశమే లేని పక్షంలో మహారాష్ట్రకి చెందిన ఓట్ ఫర్ డెమోక్రసీ సంస్థపై కేంద్ర ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఉండవల్లి ప్రశ్నిస్తున్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వాల పాలనలో నడిచే దేశంలో ఇలాంటి ఆరోపణలు రావడం మంచిది కాదని మేధావులు అభిప్రాయపడుతున్నారు. నిజానికి 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత ఎన్నడూ లేనివిధంగా ఈవీఎంలపై ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా ఆంధ్రాలో వైసీపీ కేవలం 11 సీట్లకి పరిమితం కావడం కూడా ఎవరికీ మింగుడు పడడంలేదు. ఎక్కడో ఏదో జరిగిందని విద్యావంతులు సైతం అనుమానం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే, వైసీపీ అధినేత మాత్రం ఈ విషయంలో గుంభనంగా వున్నారు. కూటమికి 164 సీట్లు అసాధ్యం అని వాదిస్తే గత ఎన్నికలలో తనకి 151 ఎలా వచ్చాయన్న ప్రశ్న తెరపైకి వస్తుందేమోనన్న భయం కూడా జగన్‌లో లేకపోలేదని, అందుకనే ఆయన ఈవీఎంల విషయంలో నోరు మెదపడం లేదని విశ్లేషకులు చెప్తున్నారు.

ఏది ఏమైనా, ప్రజాస్వామ్యానికే ప్రమాదకరంగా మారే ఇలాంటి ఆరోపణని అంత తేలిగ్గా తీసుకోవడం కూడా మంచిది కాదని వివిధ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రమైనదిగా పరిగణించి దర్యాప్తు జరిపించాలని వారంటున్నారు. వాస్తవాలని ప్రజలకి తెలియచేయవలసిన బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వంపై ఉందని, లేదంటే ఇలాంటి ఆరోపణలు, అపోహలతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుందని సీనియర్ రాజకీయ నేతలు, విశ్లేషకులు, మేధావులు వివిధ పార్టీల శ్రేణులు అభిప్రాయపడుతున్నారు!

# ఇసుకతో మసక!

(మొదటిపేజీ తరువాయి)

అంతలోనే ఇసుక విషయంలో ప్రభుత్వం మాట తప్పిందంటూ బాబు ప్రతిష్టని మసకబార్చే ప్రచారం జోరుగా సాగుతోందని అధికారపార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు. అయితే, జరుగుతున్న ప్రచారంలో నిజానిజాలు ఏమిటన్న విషయం ఆరాతీస్తే, గత ప్రభుత్వం చరమాంకంలో సరఫరా చేసిన ధర కంటే ప్రస్తుత ప్రభుత్వం ప్రథమాంకంలో సరఫరా చేస్తున్న రేటు ఎక్కువగా వున్న మాట నిజమే అన్నది మాత్రం స్పష్టమవుతోంది.

ఇలా ఎందుకయ్యా...? అని ప్రశ్నిస్తే గత ప్రభుత్వంలో ఇసుక రీచ్‌ల నుండి డంపింగ్ యార్డులకు తరలించారని, సదరు యార్డుల నుండి ఇసుక తరలించుకోవడానికి రేటు తడిసి మోపెడవుతోందని వినియోగదారులు అంటున్నారు. నగరాలకి సమీపంలో వున్న ఇసుక రీచ్‌లలో ఇంకా తవ్వకాలకి అనుమతులు రాలేదు కాబట్టి చాలా దూరం నుండి తరలించుకోవలసి వస్తోందని చెప్తున్నారు. అప్పట్లో టన్నుకి 475 రూపాయలు చెల్లిస్తే ఇప్పుడు 670 రూపాయలు కట్టాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇసుక పాలసీపై ఇంకా పూర్తిగా నిర్ణయం తీసుకోలేదని, సెప్టెంబర్ నెల నుండి స్పష్టమైన షరతులతో ప్రజలకి అందుబాటు ధరలో ఇసుక లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టబోతోందని అధికారులు చెప్తున్నారు. మధ్యలో దళారులు, రవాణా నిర్వాహకులు, లోడింగ్ కాంట్రాక్టర్లు ప్రజల అవసరాన్ని బట్టి రేట్లు నిర్ణయించి డబ్బులు గుంజుకుంటున్నారని ఇసుక వినియోగదారులు తల బాదుకుంటున్నారు.

ఆగస్టు 21న బుధవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మధ్యవర్తుల దోపిడీ వ్యవహారం తన దృష్టికి వచ్చిందని, ఇకనుండి వారి ప్రమేయం లేకుండా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం వినియోగదారులకి ఇసుక అందేలా చూడమని అన్ని జిల్లాల కలెక్టర్లకి ఆదేశాలు ఇచ్చారు. ఇసుకతో మసక బారుతున్న బాబు ప్రభుత్వ ప్రతిష్టని కాపాడుకునే క్రమంలో కఠినంగా వ్యవహరించమని అధికారులకి ఆదేశాలు ఇచ్చారు. మొత్తంమీద సెప్టెంబర్‌లో ఇసుకపై ప్రభుత్వ పాలసీ ప్రకటించేదాకా ఈ దాగుడుమూతలు, ధరల మోతల కష్టాలు తప్పవేమో!

# శ్రీసిటీ

(మొదటిపేజీ తరువాయి)

ఏఐ సాంకేతికత, సోలార్ విద్యుత్, విద్యుత్ వాహనాల విషయంలో అధిక ప్రాధాన్యత ఉంటుందని, వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతమున్న ఆంధ్ర రాష్ట్రంలో వ్యాపార అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో మరిన్ని కొత్త పోర్టులు, విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఉత్పత్తులు పెంచడం, ఉపాధి పెంపొందించడం తమ ప్రాధాన్యత అన్నారు. రాష్ట్రంలో పనిచేసే 3.74కోట్ల జనాభా మొత్తాన్ని నైపుణ్య మానవ శక్తిగా మార్చాల్సిన అవసరం ముందని, అందుకోసం నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. భవిష్యత్తులో పెట్టుబడులను ఆకర్షించే నెంబర్1 వ్యాపార కేంద్రంగా ఏపీ మారుతుందని స్పష్టం చేశారు.

## అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రం శ్రీసిటీ

**- సీఎం ప్రశంస**

దాదాపు 30 దేశాలకు చెందిన 220 పరిశ్రమలతో టాప్ బ్రాండ్ల ఉత్పత్తులకు నిలయంగా మారిన శ్రీసిటీ, అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా ముఖ్యమంత్రి ప్రశంసించారు. అందరు మెచ్చే వ్యాపార కేంద్రం శ్రీసిటీ అని అంటూ, అందుకు శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, ఎం.డీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. శ్రీసిటీ కేంద్రంగా చెన్నై, నెల్లూరు (కృష్ణపట్నం), తిరుపతిని కలుపుతూ 'ట్రై - సిటీ' పారిశ్రామిక అభివృద్ధికి వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. శ్రీసిటీలో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు వుండవని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పరిశ్రమల శాఖామంత్రి టిజి భరత్, హోంమంత్రి వంగలపూడి అనిత, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తదితరులు పాల్గొన్నారు. తొలుత, స్థానిక బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో సుమారు 1570 కోట్ల పెట్టుబడితో ఉత్పత్తులకు సిద్ధమైన 15




నూతన పరిశ్రమలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. దీని ద్వారా 8500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. అదేవిధంగా, రూ. 900 కోట్ల పెట్టుబడితో 2740 మందికి యువతకు ఉపాధి కల్పించనున్న 7 పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేశారు. రూ.1213 కోట్ల పెట్టుబడితో 4 వేల మందికి ఉపాధి కల్పించే మరో 5 పరిశ్రమలకు సీఎం సమక్షంలో అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. వీటితో పాటు శ్రీసిటీలో నూతనంగా నిర్మించిన అగ్నిమాపక సముదాయానికి ప్రారంభోత్సవం, అధునాతన పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

## చంద్రబాబుకు ఘన స్వాగతం...

శ్రీసిటీ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి శ్రీసిటీలో అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. శ్రీసిటీ హెలిపాడ్ వద్ద జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పుష్పగుచ్చాలతో సీఎంకు స్వాగతం పలికారు. అక్కడ నుంచి బిజినెస్ సెంటర్ చేరుకున్న సీఎంకు పూర్ణకుంభం, మేళ తాళాలతో ఆహ్వానం పలికారు. పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్, ఇండస్ట్రీస్ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఏపిఐఐసి వీసీ అభిషిక్త కిషోర్, తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, డిఐజీ షిమోషి బాజ్‌పాయ్, ఎస్పీ సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు నెలవల సుబ్రమణ్యం, పరసా రత్నం తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.





# శ్రీసిటీలో వినూత్నంగా.. 'స్కోర్ పోర్టల్' ప్రారంభం

శ్రీసిటీ సుస్థిర అభివృద్ధి చర్యల్లో భాగంగా ఈనెల 20న శ్రీసిటీలో మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆన్‌లైన్ రిసోర్స్ ఎక్స్చేంజ్ (ఎస్‌సిఓఆర్ఇ) పేరుతో ఒక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. దీని ద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలో పరస్పర సహకార ఆర్థిక విధానాలను ముందుకు తీసుకెళ్ళవచ్చని భావిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన ఈ వర్చువల్ లాంచ్ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల పర్యావరణ నిర్వాహకులు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు. అమెరికాలోని మిచిగాన్ యూనివర్సిటీకి చెందిన సస్టైనబిలిటీ నిపుణులు డాక్టర్ సుధాకర్ జి.రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కాగా, శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్(పర్యావరణం) డా. పి.వెంకటేశ్వరన్ మాట్లాడుతూ, వనరుల భాగస్వామ్యం కోసం ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి 'స్కోర్' ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో ఆ పోర్టల్ యొక్క ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, ఇది ఇతర పారిశ్రామికవాడలకు ఒక మోడల్‌గా నిలుస్తుందన్నారు.

• సత్తా చాటిన ఇస్రో

# ఎస్ఎస్ఎల్వి-డి3 సక్సెస్



భూమిపై వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, ఆ సమాచారాన్ని మనకు చేరవేసే అతిముఖ్యమైన భూ సమాచార ఉపగ్రహాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇటీవల విజయవంతంగా కక్ష్యలోకి చేర్చి తన సత్తా చాటుకుంది. ఈ విజయంతో ఇస్రో మరో చరిత్రాత్మకమైన మైలురాయిని అధిగమించినట్లయింది. భారత అంతరిక్ష పరిశోధనల ప్రతిభా పాటవాలకు ఇదొక గీటురాయిగా నిలుస్తోంది.

ఇస్రో శాస్త్రవేత్తలు ఈనెల 16వ తేదీ ఉదయం 9.17 గంటలకు శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి ప్రతిష్టాకరమైన ఎస్ఎస్ఎల్వి-డీ3 రాకెట్‌ను ప్రయోగించారు. 175.5 కిలోల బరువున్న ఇఓఎస్-08 ఉపగ్రహాన్ని, దాంతోపాటు ఎస్ఆర్-0, డెమోశాట్ అనే మరో రెండు చిన్న ఉపగ్రహాలను కూడా జయప్రదంగా ఈ రాకెట్ ద్వారా రోదసిలోకి పంపించారు. రాకెట్ ప్రయోగం విజయవంతమై, కేవలం 16 నిమిషాల్లోనే ఇఓఎస్-08 ఉపగ్రహం కక్ష్యలోకి చేరడంతో శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తం చేశారు. దాని తర్వాత మరో నిమిషంలోనే మిగిలిన రెండు ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరాయి. ఇస్రో ఛైర్మెన్ డా. సోమనాథ్ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం దిగ్విజయమైంది.

## విపత్తులపై ముందుగానే అంచనా...

ఈ రాకెట్ ప్రయోగంతో రానున్న విపత్తులను ముందుగానే మరింత ఖచ్చితత్వంతో తెలుసుకునేందుకు వీలుంటుందని, సముద్రం ఉపరితలం మీదున్న గాలిని విశ్లేషించడం, నేలమీదున్న తేమను అంచనా వేయడం వంటివాటికి కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు చెప్పున్నారు. అదేవిధంగా, ఈ ఉపగ్రహం ద్వారా సముద్రమట్టాలు, అగ్నిపర్వతాల పరిస్థితులను కూడా అంచనా వేయవచ్చని అంటున్నారు. ఈ భూ పరిశీలన ఉపగ్రహం ఏడాదిపాటు పనిచేయనుందని భావిస్తున్నారు.

# శ్రీసిటీలో వేడుకగా గోపూజ



శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఇటీవల గోపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుప్రభాతసేవ, ఇతర ప్రత్యేక పూజలతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. వేంకటాచల మహాత్యంలో వివరించిన విధంగా వేదపండితులు గోవిందునికి-గోమాతలకు మధ్య ఉన్న పవిత్రబంధాన్ని తెలియచేస్తూ గోపూజ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన అన్నమాచార్య ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 'అన్నమయ్య సంకీర్తనావళి' భక్తులను ఎంతగానో అలరించింది. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు టి.తేజోవతి(గాత్రం), కె.భరద్వాజ్ (కీబోర్డ్), కె.గోపి(తబలా), జి.శ్రీనివాసులు(శృతి) ఆరు ప్రసిద్ధ అన్నమాచార్య కృతులను, గోవింద నామావళిని అత్యద్భుతంగా ఆలపించారు. శ్రీ తిరు వేంకటరామానుజ భక్త సమాజం సభ్యులు కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ భజనలతో భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం, భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాన్ని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం పట్ల శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో తన సంతోషం వ్యక్తం చేశారు.

'అన్న క్యాంటీన్ల'ను..

# నిరంతరం కొనసాగిస్తాం

స్పష్టం చేసిన మంత్రి నారాయణ



ఆకలితో బాధపడే నిరుపేదలకి కేవలం రూ.15లకే మూడు పూటలా కడుపు నిండా మంచి భోజనం పెట్టేందుకు... రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను నిరంతరం కొనసాగిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలోని చేపల మార్కెట్ వద్ద అన్నా క్యాంటీన్‌ను టీడీపీ నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుపేదలకి స్వయంగా మంత్రి నారాయణ టిఫిన్ వడ్డించి, వంటకాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నేతలు, నిరుపేదలతో కలిసి ఆయన కూడా అల్పాహార విందు చేశారు.

అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 99 అన్న క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా, కేవలం రూ. 5లకే ప్రతి పేదవాడు మంచి భోజనం తింటున్నాడన్నారు. రోజుకి రెండు లక్షల 25వేల మంది అన్న క్యాంటీన్లో భోజనం చేస్తున్నారన్నారు. అలాంటి క్యాంటీన్లను గత ప్రభుత్వం మూసేయడం దారుణమన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం కొందరు దాతలు ముందుకు వస్తున్నారన్నారు. అందులో శ్రీనివాసరావు అనే దాత కోటి రూపాయలు ఇచ్చారన్నారు. అలాగే ముఖ్యమంత్రి సతీమణి కూడా కోటి రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. గుడివాడలో అన్న క్యాంటీన్ దగ్గర మరో రూ. 58లక్షలు విరాళాలను దాతలు అందచేశారన్నారు. ఈ విధంగా కార్పస్ ఫండ్ డెవలప్ చేసి... అన్న క్యాంటీన్లను శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటుచేస్తామని ఆయన తెలిపారు.

# ఎన్‌బికెఆర్‌లో అవగాహన సదస్సు




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇ.డి సెల్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల రోల్ ఆఫ్ ఇన్నోవేషన్ ఆన్ ఎంట్రపెన్యూర్‌షిప్, మరియు ఎకనామిక్ గ్రోత్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ దామోదర్‌రెడ్డి (అంబుర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ (రిటైర్డ్), నాసా ఏరోస్పేస్, వర్జీనియా, యూఎస్ఏ) పాల్గొని విద్యార్థులకు ఇన్నోవేషన్ అనే అంశం పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ సబ్జెక్టుపైన మంచి అవగాహన కలిగివుండాలని తెలిపారు. భారతదేశం రాబోయే రోజులలో ఇన్నోవేషన్స్ ద్వారా ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలబడాలని, అందుకు ప్రస్తుత విద్యార్థినీ విద్యార్థులు సంసిద్ధంగా ఉండాలని కోరారు. ఏరోస్పేస్ టెక్నాలజీలో కావలసిన నైపుణ్యాలను గురించి ఆయన తెలియజేశారు. మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సి హెచ్ ఆర్ విక్రమ్‌కుమార్, ఇ.డి సెల్ కన్వీనర్ డాక్టర్ పి.శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌లో రక్తదానం




నెల్లూరులోని రెడ్‌క్రాస్ రక్తనిధిలో ఈనెల 19న రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ 50వసారి రక్తదానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. అదేవిధంగా తన మిత్రులు నిరంజన్, రవికుమార్, కేశవులు, ఆశ్రితలతో కూడా రక్తదానం చేయించారు. రక్తదానమంటే ప్రాణదానమేనని, రక్తదానం ద్వారా బాధితులను ఆదుకునేందుకు యువత ముందుకు రావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో రాఖీ వేడుకలు నిర్వహించారు. డాక్టర్ వరప్రసాద్, షేక్ రఫీక్ అహ్మద్, కార్యదర్శి మస్తానయ్య, ప్రిన్సిపాల్ గురునాథరావు, సాయిరాం పాల్గొన్నారు.

## టూకీగా...



### పల్లిపాడులో 'రక్తహీనత'పై అవగాహన

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో ఈనెల 19న రక్తహీనత నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడు, డాక్టర్ కిషోర్‌కుమార్ పాల్గొని గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యసలహాలిచ్చారు. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. హెల్త్‌ఎడ్యుకేటర్ చేజర్ల సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### కందుకూరులో విఖనస మహర్షికి విశేష పూజలు

మహావిష్ణు మానసపుత్రుడు, వైఖానసాగమ ఆదిమ గురువు విఖనస మహర్షికి కందుకూరులో ఈనెల 19న ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణపూర్ణిమ రోజున ఆ మహర్షి జయంతి సందర్భంగా పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో కొలువైన విఖనసమహర్షి మూలమూర్తికి వైభవంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### రాపూరులో విద్యార్థినులకు ఆరోగ్యపరీక్షలు

రాపూరులోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలోని 198మంది విద్యార్థినులకు ఈనెల 19న డాక్టర్ సుదర్శనమ్మ ఆధ్వర్యంలో ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ క్రిస్టియానా జేమ్స్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి, తగు ఆరోగ్య సలహాలిచ్చారు. రక్తహీనత ఉన్న విద్యార్థినులకు ఐరన్ మాత్రలను అందజేశారు.

### కోవూరులో వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు

మండల కేంద్రమైన కోవూరులో ఈనెల 19న కోవూరు వాకర్స్ అసోసియేషన్ ప్రారంభమైంది. అధ్యక్షునిగా పి.రామమోహన్‌రెడ్డి, కార్యదర్శిగా బి.మధుసూదన్‌రావుతో పాటు, మొత్తం 10మందితో అసోసియేషన్‌ను ఏర్పాటుచేసుకున్నారు. నడక ఆరోగ్యానికి దివ్యౌషధమని, శారీరక ఆరోగ్యం-మానసిక ఉల్లాసం కోసం అందరూ నడకను అలవాటు చేసుకోవాలని వారు సూచించారు.

### బుచ్చి ఎంపీడీఓకి సన్మానం

ఎన్నికల సందర్భంగా బదిలీపై అనంతపురానికి వెళ్లిన ఎంపీడీఓ నరసింహారావు, తిరిగి బుచ్చిలో ఎంపీడీఓగా నియమితులైన సందర్భంగా, ఆయన సేవలను కొనియాడుతూ ఈనెల 19న బుచ్చిరెడ్డిపాళెం సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు.

### దగదర్తి శివాలయంలో కుబేర యజ్ఞం

మండల కేంద్రమైన దగదర్తిలోని శివాలయంలో ఇటీవల వైభవంగా కుబేర యజ్ఞం జరిగింది. పెద్దసంఖ్యలో గ్రామస్తులు, భక్తులు ఈ యజ్ఞంలో పాల్గొని, శివాలయంలో కొలువైవున్న పరమశివునికి ప్రత్యేకపూజలు చేశారు.

### చాకిచర్లలో విద్యార్థులకు పుస్తకపఠనం

ఉలవపాడు మండలంలోని చాకిచర్లలో ఉన్న గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా, బాల బాలికలకు పుస్తక పఠనంపై గ్రంథాలయాధికారులు బాల బాలికలకు అవగాహన కలిగించారు. పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని వారికి చెప్పారు.

### శ్రీరామపురంలో టీకా కేంద్రం పరిశీలన


వెంకటాచలం మండలంలోని శ్రీరామపురం గ్రామంలో ఏర్పాటుచేసిన టీకా కేంద్రాన్ని ఈనెల 19దన అదనపు డిఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ ఎస్‌కె ఖాదర్‌వలి పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా టీకా లక్ష్యాలను పూర్తిచేయాలని ఆరోగ్యసిబ్బందికి చెప్పారు. సిహెచ్ఓ రామసుబ్బారెడ్డి, హెల్త్ ఆఫీసర్ రాజేశ్వరి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

### చినగాంపల్లిలో పోలేరమ్మకు పొంగళ్లు

సీతారామపురం మండలంలోని చినగాంపల్లి గ్రామంలో ఇటీవల పోలేరమ్మ అమ్మవారికి గ్రామస్తులు పొంగళ్ళు వండి నైవేద్యంగా సమర్పించారు. జడ్పీటీసీ గురవారెడ్డి, సర్పంచ్ మునగాల రామచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో ఎడ్లబండిపై ప్రభలు కట్టి అమ్మవారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు.

SRI CITY
An Integrated Business City

# ధన్యవాదాలు



పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యంగా.. వేలాది మందికి ఉపాధి కల్పనే ధ్యేయంగా
శ్రీసిటీలో జరిగిన ప్రగతి సంబరాలను ప్రారంభించడానికి స్వయంగా విచ్చేసి,
ఆశీర్వదించిన అభివృద్ధి సారధులు, వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధకులు
గౌరవ ముఖ్యమంత్రివర్యులు

## శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి

ధన్యవాదాలు.

మాన్య ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ఆగస్టు 19, 2024న 15 పరిశ్రమల ప్రారంభోత్సవం,
7 పరిశ్రమలకు భూమి పూజ, మరో 5 పరిశ్రమలతో అవగాహనా ఒప్పందాలు జరిగాయి.
వీటితో పాటుగా శ్రీసిటీ అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించి, హైటెక్ పోలీస్‌స్టేషన్ భవనానికి శంకుస్థాపన చేశారు.










శ్రీసిటీ అంతర్జాతీయ ప్రత్యేక పారిశ్రామికవాడలో ఇప్పటికే 30 దేశాలకు చెందిన 220 పరిశ్రమలు స్థాపించబడి...
62 వేల మంది ఉపాధి పొందుతున్నారు. మొత్తం ఉద్యోగుల్లో 50 శాతం మంది మహిళలే!

ADMIRE | Autodata | Bell | BOMBAY COATED & SPECIAL STEELS | EPACK DURABLE | ESS KAY | EVERSHINE | JGI

LG Chem LG Polymers India Pvt. Ltd. | NeoLync | Nidec | Oji India Packaging Pvt. Ltd. | Udhaiyam | TRINATH | ZEN LINEN

AG&P Refueled. To You. | BLUE STAR | NGC | RSB | Siddhartha Logistics | TIL HEALTHCARE | VERMEIREN

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com